

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 31 | బుధవారం 6, మే 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

## కేంద్ర క్యాబినెట్
# కీలక నిర్ణయాలు




న్యూఢిల్లీ, మే 5: దేశాభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా కేంద్ర క్యాబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో పలు కీలక ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు ఆమోదం తెలుపుతూ దాదాపు రూ. 1,52,702 కోట్ల నిధులను మంజూరు చేసింది. మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, సెమీకండక్టర్ రంగాలకు ఈ నిధులను కేటాయించారు.

**వ్యవసాయ రంగానికి పెద్దపీట**

రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రం భారీ కేటాయింపులు చేసింది. చెరుకు రైతులకు తీపి కబురు అందించింది. 2026-27 సంవత్సరానికి గాను చెరుకు 'ఫెయిర్ అండ్ రెమ్యునరేటివ్ ప్రైస్' కోసం ఏకంగా రూ. 1 లక్ష కోట్లను కేటాయించింది. కాటన్ మిషన్.. పత్తి ఉత్పాదకతను పెంచేందుకు 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' కింద రూ. 5,659 కోట్లు మంజూరు చేసింది.

**సెమీకండక్టర్ హబ్‌గా భారత్**

టెక్నాలజీ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు సెమీకం డక్టర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ప్రకటిం చింది. క్రిస్టల్ మ్యాట్రిక్స్ లిమిటెడ్.. సెమీకండక్టర్ యూనిట్

| 2లో |

## ఏపీ ప్రజల చిరకాల స్వప్నం
# నెరవేరింది
### - సీఎం చంద్రబాబు




విశాఖ మే 05 : ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల స్వప్నమైన విశాఖ పట్నం రైల్వే జోన్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ రైల్వే శాఖ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిన చారిత్రాత్మక క్షణమని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్ర విజ్ఞప్తిని మన్నించి చారిత్రాత్మక గెజిట్ విడుదల చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. 2026 జూన్ 1వ తేదీ నుంచి విశాఖ కేంద్రంగా జోన్ కార్యకలాపాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస-ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం శుభపరిణామమని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మార్పులతో ఉత్తరాంధ్ర రవాణా రంగ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన విశాఖ, రాయగడ డివిజన్ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా ఉత్తరాంధ్ర పారిశ్రామిక ప్రగతికి ఈ జోన్ ఏర్పాటు ఎంతగానో దోహదపడుతుందని ముఖ్యమంత్రి వివరించారు.

## ప్రజాస్వామ్యాన్ని
# ఖూనీ చేస్తున్న బీజేపీ
### -ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్



న్యూఢిల్లీ మే 05 : పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం సాధించడంపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ఢిల్లీ తర్వాత, బెంగాల్‌లో కమలం పార్టీ విజయంపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీకి ప్రజాదరణ తగ్గుతున్న సమయంలో బీజేపీ బెంగాల్‌లోకి ఎలా ప్రవేశించిందో చెప్పాలని నిలదీశారు. మోదీ వేవ్ బాగా ఉన్న సమయంలోనూ ఢిల్లీ, బెంగాల్ రాష్ట్రాలలో బీజేపీ గెలవలేకపోయిందని అన్నారు. 2015లో ఢిల్లీలో, 2016లో

| 2లో |

## ప్రభుత్వ ఏర్పాటుకు
# విజయ్‌కు మూడు మార్గాలు



చెన్నై మే 05 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్కంఠభరిత ఫలితాలు వెలువడ్డాయి. 234 స్థానాలున్న అసెంబ్లీలో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లభించలేదు. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) 108 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 సీట్ల మ్యాజిక్ ఫిగర్‌కు 10 సీట్ల దూరంలో నిలిచిపోయింది. దీంతో రాష్ట్రంలో హంగ్ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు టీవీకే మూడు ప్రధాన మార్గాలపై దృష్టి సారించి, రాజకీయ సమీకరణాలపై తీవ్రంగా కసరత్తు చేస్తోంది.

**మొదటి మార్గం: డీఎంకే మిత్రపక్షాలతో పొత్తు**

| 2లో |

## రేవంత్ ఇచ్చిన హామీలకు.. చేస్తున్న
# పనులకు పొంతన లేదు
### ఈటల రాజేందర్



హైదరాబాద్ మే 05 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు,ప్రస్తుతం ఆయన చేస్తున్న పనులకు ఏమాత్రం పొంతన లేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. గజ్వేల్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ప్రయోజనాలు కల్పించడంలో, విద్యార్థులకు ఫీజు

2లో


## భవన నిర్మాణ నిబంధనల్లో
# భారీ మార్పులు



న్యూఢిల్లీ మే 05 :దేశవ్యాప్తంగా భవన నిర్మాణ రంగంలో కేంద్ర ప్రభుత్వం కీలకమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న 'నేషనల్ బిల్డింగ్ కోడ్' ను ఉపసంహరించి, దాని స్థానంలో 'నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ స్టాండర్డ్స్' ను ప్రవేశపెట్టింది. మే 1న నోటిఫై చేసిన ఈ కొత్త ప్రమాణాల ద్వారా, ముఖ్యంగా అగ్ని మరియు జీవన భద్రతకు సంబంధించిన నిబంధనల్లో ప్రభుత్వం గణనీయమైన మార్పులు చేసింది. గతంలో తప్పనిసరిగా ఉన్న ఈ నియమాలు, ఇప్పుడు కేవలం సలహా పూర్వకంగా మారాయి. నిర్మాణ రంగంలో మరింత సౌలభ్యం, ఆవిష్కరణలను ప్రోత్సహించడమే ఈ మార్పుల లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది. క్యాబినెట్ సెక్రటేరియట్‌లోని డీరెగ్యులేషన్ సెల్ సూచనల మేరకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఈ మార్పులను చేపట్టింది. ఎన్ బి ఎస్ లోని 'కోడ్' అనే పదం చట్టపరమైన బంధనాన్ని సూచిస్తోందని, దీనివల్ల తరచూ కోర్టు కేసులకు దారితీస్తోందని ప్రభుత్వం భావించింది. ఈ

| 2లో |

## ఆనంద్ ఆర్కే, సుపర్ణాశర్మలను
# వరించిన పులిట్జర్



న్యూఢిల్లీ మే 05 : ఇద్దరు భారతీయ జర్నలిస్టులను ప్రఖ్యాత పులిట్జర్ పురస్కారం వరించింది. పాత్రికేయ రంగంలో దీనిని అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదిగా భావిస్తారు. డిజిటల్ నిఘా, సైబర్ మోసాలను విస్తృతంగా వెలుగులోకి తెచ్చినందుకు ఆనంద్ ఆర్కే, సువర్ణాశర్మలు ఈ అవార్డును దక్కించుకున్నారు. ఇలస్ట్రేటెడ్ రిపోర్టింగ్, కామెంటరీ విభాగం కింద దీనిని ప్రకటించారు. ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ బ్లూమ్‌బర్గ్‌కు చెందిన నటాలీ ఒబికో పియర్సన్‌తో కలిసి వీరిద్దరు ఈ అవార్డును పంచుకోనున్నారు. పులిట్జర్ బోర్డు సోమవారం న్యూయార్క్‌లో విజేతలను ప్రకటించింది. విజువల్ రిపోర్టింగ్, వ్యాఖ్యానం విభాగంలో వారు దీనిని గెలుచుకున్నట్లు పులిట్జర్ వెబ్ సైట్ పేర్కొంది. కొలంబియా యూనివర్సిటీ ఈ అవార్డును అందిస్తుంటుంది. బ్లూమ్

| 2లో |

# సంపాదకీయం

## పజల ఆకాంక్షలను బిజెపి గౌరవించాలి !

దేశంలో అత్యధిక రాష్ట్రాలు ఇప్పుడు బిజెపి ఖాతాలో పడ్డాయి. మోడీ నామజపంతో పొంగిపోకుండా ప్రజలకు మార్పును చూపాలి. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలకు పరిష్కారం దక్కాలి. విద్య,వైద్యం,ఉపాధి రంగాలకు పెద్దపీట వేయాలి. బిజెపి రావడం వల్లనే ఈ సమస్యలు పరిష్కారం అయ్యాయని ప్రజలు చర్చించాలి. అప్పుడే మార్పు సాధ్యం అవుతుంది. ఇకపోతే మిగతా రాష్ట్రాల్లో ఎలా ఉన్నా..బెంగాల్లో సరిహద్దులకు కంచె వేస్తామన్న బిజెపి హామీ నెరవేర్చాలి. ఇందుకు తక్షణం నడుం బిగించాలి. అలాగే చొరబాటుదారులను గుర్తించి నిర్దాక్షిణ్యంగా ఏరి పారేయాలి. ఎందుకంటే చొరబాటు దారులు స్థానిక ప్రజలను మించి, పెత్తనం సాగిస్తున్నారు. ఊరూరా జల్లెడ పట్టి వారిని గుర్తించాలి. రోహింగ్యాల విషయంలో ఎలాంటి క్షమాగుణం అవసరం లేదు. భారతదేశం ధర్మసత్రం కాదన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే ఇందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి. బెంగాల్‌తో పాటు అసోం, ఈశాన్య రాష్ట్రాలను జల్లెడపడితే తప్ప స్థానికంగా గొడవులు సద్దుమణగవు. ఒక్కొకక్కరిని గుర్తించి, వారి ఆధార్, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు వంటివన్నీ లాగేసుకుని సరిహద్దు దాటించాలి. అలాగే సరిహద్దు కంచెపైనా నిర్ణయం తీసుకోవాలి. ఇవే సమస్యలపై బిజెపి పోరాడింది కనుక ప్రభుత్వం ఏర్పాటు కాగానే ప్రథమ కర్తవ్యం ఇదే కావాలి. యావద్భారతంలో ఆసక్తి రేకెత్తించిన ఐదు అసెంబ్లీల ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే ప్రజలు మార్పును కోరుకున్నారు. బెంగాల్లో మమతా బెనర్జీ 15 ఏళ్ల రాక్షస పాలనను ప్రజలు తమ ఓటుహక్కుతో తిరస్కరించారు. ఇకపోతే తమిళనాట విజయ్ గెలవడం ఓ సంచలనమే. ఆయన హామీలు గుప్పించారు. తెలుగు రాష్ట్రాల్లో లాగా బంగారం, మహిళలకు నెలనెలా పెన్షన్ లాంటి చెల్లింపులు తదితర హామీలు గుప్పించారు. ద్రవిడ పార్టీల ఆధిక్యాన్ని సవాలు చేస్తూ.. తమిళనాట సినీ హీరో విజయ్ అరంగేట్రంలోనే అదరగొట్టడంలో హామీల బుట్ట కూడా ఉంది. సినీ ఛరిష్మాకు తోడు, హామీలు కూడా కలసి వచ్చాయి. కనుక గత పాలకుల వైఫల్యాలను ముందు పెట్టుకుని విజయ్ నడుచుకుంటేనే నిలదొక్కు కోగలరు. కేరళలో యూడీఎఫ్ మళ్లీ పీఠమెక్కడంతో.. కామ్రేడ్లకు ఇక దేశంలో ఎక్కడా స్థానం లేకుండా పోయింది. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు బెంగాల్, త్రిపుర, కేరళలో అవకాశాలు లేనట్లుగానే భావించారు. ఇది వారి స్వయంకృ తమనే చెప్పలి. నేలవిడిచి సాము చేయడం కమ్యూనిస్టులకు అలవాటు. కేరళలో కూడా అదే జరిగింది. పదేళ్ల పినరయ్ విజయన్ అధికారంలో కేరళలో గణనీయమైన మార్పులు గోచరించ లేదు. అస్సాంలో కమలం ముచ్చటగా మూడోసారి జయభేరి మోగించారు. పుదుచ్చేరిలో మళ్లీ సామాన్యుడికే పీఠం దక్కింది. అస్సాం, పుదుచ్చేరి తప్పిస్తే... అంతటా ఓటర్లు మార్పునే కోరుకున్నారు. భారత ప్రజాస్వామ్యంపై నమ్మకం కల్పించిన రోజిది. మన రాజ్యాం గం, రాజ్యాంగ సంస్థలు విజయం సాధించాయి. అని ప్రధాని మోడీ ప్రకటించుకున్నారు. ఒక్కో రాష్ట్రం బిజెపి ఖాతాలో పడుతున్న వేళ ప్రజలకు మేలైన పాలన దిశగా బిజెపి కృషి చేయాలి. లేకుంటే ఈ ఆనందం ఆవిరి కావ డానికి కూడా సమయం పట్టదు. గంగోత్రి నుంచి గంగా సాగర్ వరకు కమలం వికసించిందన్న ప్రధాని మోదీ, ప్రజల ఆకాంక్షలను కూడా పట్టించుకోవాలి. దేశంలో అనేకానేక సమస్యలు ఉన్నాయి. వాటిపై కమలనాథులు దృష్టి సారించాలి. ఇద్దరు ముఖ్యమంత్రులు స్టాలిన్, మమతా బెనర్జీ తాము పోటీ చేసిన స్థానాల్లో ఘోర పరాజయం పాలయ్యారు. ఆయా రాష్ట్రాల్లో పలువురు మంత్రులు మట్టికరిచారు. భవానీపుర్‌లో పోటీ చేసిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన ప్రత్యర్థి, ప్రతిపక్ష భాజపా నేత సువేందు అధికారి చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. ఆమెతో పాటు దాదాపు 20 మంది మంత్రులు ఓడిపోయారు. సువేందు అధికారి రెండు చోట్లా విజయం సాధించారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో మమతా బెనర్జీ తీవ్ర అసహనానికి గురయ్యారు. చివరి వరకూ వేచి ఉండాలని, విజయం తమదేనని మధ్యాహ్నం సమయంలో వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం, భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. అయితే సాయంత్రానికి తృణమూల్ పరాజయం పరిపూర్ణమైంది. రాజకీయాల్లో కక్షలు కార్పణ్యాలు తగవు. ప్రజలను ప్రజలుగా చూడలేని వారు అధికారానికి అనర్హులు. బెంగాల్లో ప్రజలకు గత పదిహేనేళుగా స్వేచ్ఛ లేకుండా పోయింది. బెంగాల్ విజయంతో భాజపా స్వతంత్రంగా పాలించే రాష్ట్రాల సంఖ్య 15కు చేరనున్నాయి. అదనంగా బిహార్‌లో జేడీయూ, ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా, నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్, మేఘాలయలో నేషనల్ పీపుల్స్ పార్టీ తదితరాలతో కలిపి భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 21కి చేరుతోంది. దాదాపు 75శాతం రాష్ట్రాలు బిజెపి గుప్పిట ఉన్నట్లే. కనుక పాలనలో మార్పు కనిపించాలి. ప్రజలకు బిజెపి పట్ల అనురాగం పెరగాలి. ఇజెపికి ఓటేసినందుకు ప్రజలు ఆనందపడాలి. అందుకు అనుగుణంగా పాలనా పరమైన మార్పులు రావాలి. రాజకీయ పందురాలకు, ఉచిత పథకాలకు దూరంగా ఉండాలి. పన్నుల రూపంలో వచ్చే డబ్బులను అభివృద్ధికే వినియోగించాలి. అప్పుడే బిజెపిని మరోమారు ప్రజలు నమ్ముతారు. అందుకు కఠినమైన నిర్ణయాలకు కూడా వెనకాడరాదు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

బెంగాల్‌లో బీజేపీకి మూడు సీట్ల చొప్పున మాత్రమే వచ్చాయని గుర్తు చేశారు. కానీ మోదీ ప్రజాదరణ అట్టడుగు స్థాయికి పడిపోయిన ప్రస్తుత సమయంలో అవే ఢిల్లీ, బెంగాల్ రాష్ట్రాలలో ఎలా గెలిచిందో చెప్పాలని అన్నారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆరోపించారు. మన దేశం ప్రస్తుతం అతిపెద్ద సంక్షోభంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 2025 ఢిల్లీ ఎన్నికల్లో తన ఓటమిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీజేపీ ప్రత్యర్థి పార్టీలను బలహీనపరిచేందుకు 'ఓట్ల తొలగింపు' అనే వ్యూహాన్ని అమలు చేస్తోందని ఆరోపించారు. 2025లో ఢిల్లీలో, ఇప్పుడు బెంగాల్‌లో జరిగింది ఇదే అని తెలిపారు. తాను జైలుకు వెళ్లకముందు తన నియోజకవర్గంలో 1.48 లక్షల ఓట్లు ఉండేవని, తాను తిరిగి వచ్చేసరికి అవి 1.06 లక్షలకు పడిపోయాయని తెలిపారు. కేవలం ఆరు నెలల్లో 42 వేల ఓట్లను తొలగించారని మండిపడ్డారు. అంతకుముందు ఎన్నికల్లో తాను 30 వేల ఓట్ల మెజారిటీతో గెలిచానని, కానీ ఓట్ల తొలగింపు తర్వాత మూడు వేల ఓట్లతో ఓడిపోవాల్సి వచ్చిందని అన్నారు. హామహారాష్ట్ర సహా వివిధ రాష్ట్రాల్లో కూడా ఇలాగే జరిగిందని అన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని హెచ్చరించారు.

## కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు..

ఏర్పాటు కోసం ఈ సంస్థకు రూ. 3,068 కోట్లు కేటాయించారు. సుచి సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్.. మరో యూనిట్ కోసం రూ. 868 కోట్లు మంజూరు చేశారు.

**రైల్వే కనెక్టివిటీ విస్తరణ**

రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు మూడు కీలక మార్గాల్లో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. నగద – మథుర రైల్వే లైన్ నిర్మాణానికి రూ. 16,403 కోట్లు, గుంతకల్ – వాడి లైన్ నిర్మాణానికి రూ. 4,758 కోట్లు కేటాయించారు. ఇది తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరుస్తుంది. బుర్హ్వాల్ – సీతాపూర్ రైల్వే లైన్‌కు రూ. 2,276 కోట్లు కేటాయించారు. వీటితోపాటు మరికొన్ని ఇతర కీలక నిర్ణయాలను కేంద్ర క్యాబినెట్ తీసుకుంది. యం యస్ యం ఈ లకు మద్దతునిచ్చేలా ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్ కోసం రూ. 18,100 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. షిప్పింగ్ రంగం.. వడినర్‌లో ఓడల మరమ్మత్తుల సౌకర్యాల అభివృద్ధికి రూ. 1,570 కోట్లు కేటాయించారు. సుప్రీంకోర్టు బలోపేతం.. అత్యున్నత న్యాయస్థానం పనితీరును మరింత మెరుగుపరచడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ఒక కీలక విధాన నిర్ణయాన్ని క్యాబినెట్ ఆమోదించింది. దీంతోపాటు, సుప్రీంకోర్టులో మరో నలుగురు న్యాయమూర్తులను పెంచడానికి కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో దేశ అత్యున్నత న్యాయస్థానంలో జడ్జిల సంఖ్య 33 నుంచి 37కు చేరుతుంది. ఈ భారీ కేటాయింపులు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, భారీగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

## చిత్తశుద్ధి, సమన్వయంతో పనిచేసి నగర అభివృద్ధికి పాటు పడాలి

### - జిల్లా కలెక్టర్, కడప నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డా. శ్రీధర్ చెరుకూరి



కడప, మే 5 : చిత్తశుద్ధితో, సమన్వయంతో, ప్రణాళిక బద్ధంగా పనిచేసి కడప నగర అభివృద్ధికి పాటు పడాలని జిల్లా కలెక్టర్, కడప నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్, కడప నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన కడప నగర అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి తోపాటు కేఎంసీ కమిషనర్ రాకేష్ చంద్రం, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఈఈ విజయ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా.. జిల్లా కలెక్టర్, కడప నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. కడప నగరాభివృద్ధిలో భాగంగా పారిశుద్ధ్యం, స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి కడపను ఆరోగ్యకరమైన సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని రకాల చర్యలను చేపట్టడం జరుగుతోందన్నారు. ప్రధానంగా నగర పాలక సంస్థ పరిధిలోని కమలాపురం నియోజకవర్గ రూరల్ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రజలకు ఎలాంటి కొరత లేకుండా చూడాలన్నారు. నగరానికి తలమానికంగా.. పలు ప్రధాన రహదారులకు విస్తరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే అన్ని ప్రధాన రోడ్లను విస్తరించి.. ఏ మాత్రం ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేస్తున్నామన్నారు. ఎర్రముక్కపల్లె– అంగడివీధి మార్గంలోని ఆర్‌ఓబీ నిర్మాణ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో ఆక్రమణల తొలగింపు చేపట్టాలని, ఒప్పందం ప్రకారం నిర్దేశించిన కాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నగరంలో ప్రస్తుతం డ్రైనేజీ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని.. ఇప్పటికే.. నగరంలో పలు రకాల సుందరీకరణ అప్నులతో పాటు, పార్కులు, ఫుట్ పాత్ లు నిర్మించామని, ట్రాఫిక్ ను నియంత్రించగలిగామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు.. జనరల్ ఫండ్ ద్వారా నగరంలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. నగరంలో త్రాగునీటి సమస్యను శాశ్వితంగా నివారించేందుకు ప్రణాళిక ప్రకారం కార్యాచరణ చేపడుతున్నామన్నారు. భూగర్భ డ్రైనేజీ, అమృత్ పనుల వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. విలీనమైన పంచాయితీలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి.. అభివృద్ధి చర్యలు చేపడుతున్నామన్నారు. కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. కేఎంసి ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో, కమిషనర్ పర్యవేక్షణలో ఇటీవలి కాలంలో కడప నగరం పురోగమనం దిశగా అభివృద్ధి చెందుతోందన్నారు.

## భవన నిర్మాణ నిబంధనల్లో భారీ మార్పులు

నేపథ్యంలో, ఆ పదాన్ని తొలగించి 'స్టాండర్డ్స్'గా మార్చారు. దీంతో ఈ నిబంధనలు ఇకపై స్వచ్ఛంద మార్గదర్శకాలుగా ఉంటాయి. ఈ మార్పుల్లో అత్యంత కీలకమైనది అగ్ని భద్రతకు సంబంధించిన విభాగం. నిజానికి, ఈ విభాగాన్ని పూర్తిగా తొలగించాలని డీరెగ్యులేషన్ సెల్ మొదట సూచించింది. అయితే, అగ్నిమాపక భద్రతా నిపుణుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో దానిని ఎన్ బి ఎస్ లో కొనసాగించారు. కానీ, నిబంధనల స్వరూపాన్ని పూర్తిగా మార్చేశారు. గతంలో ఎన్ బి సి లో ఉన్న షేల్ (తప్పనిసరి) అనే పదాన్ని తొలగించి, దాని స్థానంలో 'షౌల్డ్' (చేయాలి/ఆకాంక్షనీయం) అనే పదాన్ని చేర్చారు. అంటే, ఇకపై ఈ నియమాలు చట్టబద్ధంగా పాటించాల్సినవి కావు. అంతేకాకుండా, గతంలో 15 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న నివాస భవనాలకు వర్తించే అగ్ని భద్రతా నియమాలను, ఇప్పుడు 24 మీటర్లు (దాదాపు 8 అంతస్తులు) లేదా అంతకంటే ఎక్కువ ఎత్తున్న భవనాలకు మాత్రమే పరిమితం చేశారు. నిర్మాణం రాష్ట్ర పరిధిలోని అంశం కావడంతో, ఎత్తు, స్థల అవసరాలు, నిర్వహణ వంటి విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలే తుది నిర్ణయాలు తీసుకోవాలని కొత్త ప్రమాణాలు స్పష్టం చేస్తున్నాయి. గతంలోని కఠినమైన నియమాల (ప్రిస్క్రిప్టివ్) స్థానంలో, ఫలితాలపై ఆధారపడిన (పెర్ఫార్మెన్స్–ఓరియెంటెడ్) విధానానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఇది వినూత్న డిజైన్లకు, ఆధునిక సాంకేతికత వినియోగానికి అవకాశం కల్పిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. అయితే, ఈ మార్పుల వల్ల రాష్ట్ర అగ్నిమాపక శాఖలపై బాధ్యత మరింత పెరిగింది. ఇకపై వారు జాతీయ ప్రమాణాలను నేరుగా ఉటంకించలేరు. ప్రతి రాష్ట్రం తమ అవసరాలకు అనుగుణంగా సొంతంగా వివరణాత్మక నిబంధనలను రూపొందించుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో జాప్యం జరిగినా, నిబంధనలను బలహీనపరిచినా భవనాల్లో నివసించే ప్రజల భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రేవంత్ ఇచ్చిన హామీలకు.. చేస్తున్న పనులకు పొంతన లేదు

రీయింబర్స్‌మెంట్ చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. చివరికి న్యాయస్థానాలు జోక్యం చేసుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్థాయికి పరిస్థితి దిగజారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు అందక వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అధికారంలోకి వచ్చిన రెండేళ్లకే కాంగ్రెస్ పార్టీ ప్రజల చేత ఛీత్కరించుకునే స్థితికి చేరుకుందని ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ అహంకారానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని, తమిళనాడులో స్టాలిన్ వంటి బలమైన నేతపై ఒక సామాన్యుడు గెలిచాడంటే అక్కడి ప్రభుత్వాలపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతుందని విశ్లేషించారు. కుటుంబ రాజకీయాలు చేస్తూ, రాష్ట్రాన్ని తమ జాగీరుగా భావించే వారికి తమిళనాడు ఫలితాలు ఒక హెచ్చరిక అని పేర్కొన్నారు. అవినీతి సొమ్ముతో ఎన్నికల్లో గెలవాలనుకునే వారికి ఈ ఫలితాలు కనువిప్పు కావాలని... తెలంగాణ బాగుపడాలంటే బీజేపీ అధికారంలోకి రావడమే ఏకైక మార్గమని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

## ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌కు మూడు మార్గాలు

ప్రభుత్వ ఏర్పాటుకు అత్యంత సులువైన మార్గంగా డీఎంకే కూటమిలోని చిన్న పార్టీల మద్దతును కూడగట్టడాన్ని టీవీకే పరిశీలిస్తోంది. ఈ కూటమిలో కాంగ్రెస్‌కు 5, వామపక్షాలకు 4, ఐయూఎంఎల్‌కు 2, వీసీకేకు 2 సీట్లు ఉన్నాయి. ఈ పార్టీల మద్దతు లభిస్తే, టీవీకే సులభంగా మెజారిటీ మార్కును దాటగలదు. ఇప్పటికే కాంగ్రెస్, వామపక్షాలు, పీఎంకే వంటి పార్టీలతో టీవీకే చర్చలు ప్రారంభించినట్లు పార్టీ వర్గాల సమాచారం.

**రెండో మార్గం: మిశ్రమ కూటమి ఏర్పాటు**

ఇక, రెండో ప్రత్యామ్నాయంగా డీఎంకే, ఏఐఏడీఎంకే కూటముల్లోని కొన్ని చిన్న పార్టీలను కలుపుకొని మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని టీవీకే భావిస్తోంది. ఈ ప్రణాళిక ప్రకారం టీవీకే (108), కాంగ్రెస్ (5), పీఎంకే (4), ఐయూఎంఎల్ (2), వీసీకే (2) పార్టీలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు. ఈ ఏర్పాటులో స్వల్ప మెజారిటీ ఉన్నప్పటికీ, మద్దతిచ్చే అన్ని పార్టీలకు కేబినెట్‌లో స్థానం కల్పించడం ద్వారా ప్రభుత్వాన్ని స్థిరంగా నడపవచ్చని టీవీకే నాయకత్వం యోచిస్తోంది.

**మూడో మార్గం: ఏఐఏడీఎంకే బాహ్య మద్దతు**

రాజకీయంగా అత్యంత కీలకమైన మూడో మార్గం ప్రధాన ప్రత్యర్థి అయిన ఏఐఏడీఎంకే నుంచి బయటి మద్దతు తీసుకోవడం. ఏఐఏడీఎంకేకు 47 మంది సభ్యుల బలం ఉంది. ఆ పార్టీతో విస్తృత కూటమి కాకుండా కేవలం బయటి నుంచి మద్దతు తీసుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఈ వ్యూహంలో భాగం. దీనివల్ల సంకీర్ణ ప్రభుత్వంలోని ఇబ్బందులు లేకుండా, అంతర్గత స్థిరత్వంతో పాలన సాగించవచ్చని టీవీకే భావిస్తోంది. అయితే, సైద్ధాంతికంగా భిన్న ధ్రువాలైన ఈ రెండు పార్టీల మధ్య ఈ ఏర్పాటు ఎంతవరకు సాధ్యమవుతుందనేది ఆసక్తికరంగా మారింది. రాబోయే కొద్ది రోజుల్లో తమిళ రాజకీయాలు ఏ దిశగా సాగుతాయో స్పష్టత రానుంది.

## ఆనంద్ ఆర్కే, సుపర్ణాశర్మలను వరించిన పులిట్జర్

బర్గ్‌లో 'ట్రాప్డ్' అనే శీర్షికతో ప్రచురితమైన పరిశోధనాత్మక రిపోర్టులో సాంకేతికతను వినియోగించి మోసగాళ్లు, సామాన్యులను ఎలా ట్రాప్ చేస్తున్నారో, వారికి ఎదురయ్యే ప్రమాదాలను ప్రపంచానికి చాటిచెప్పింది. ఫోన్ ద్వారా డిజిటల్ అరెస్టుకు గురైన భారతదేశంలోని ఒక న్యూరాలజిస్ట్ గురించి చెబుతూ, ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం పెరుగుతున్న నిఘా, డిజిటల్ మోసాల సవాళ్లను కళ్లకు కట్టినట్లు ఈ పరిశోధనాత్మక రిపోర్టు వివరించింది.

# మదనపల్లిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కంట్రోల్ బూత్‌లు ఏర్పాటు

## - లాంఛనంగా ప్రారంభించిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి





మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీని క్రమబద్ధీకరించడానికి మరియు ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లా పోలీస్ శాఖ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో అత్యాధునిక ట్రాఫిక్ కంట్రోల్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మంగళ వారం మదనపల్లిలోని అన్నమయ్య సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ముఖ్య అతిథిగా హాజరై 10 ట్రాఫిక్ బూత్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మదనపల్లి పట్టణం జిల్లాలోనే అతిపెద్ద వ్యాపార కేంద్రంగా ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ సవాలుగా మారిందన్నారు. విధుల్లో ఉన్న ట్రాఫిక్ సిబ్బంది ఎండ, వానల నుండి రక్షణ పొందుతూనే, ప్రజలకు మెరుగైన సేవలందించడానికి ఈ బూత్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. 10 బూత్‌లను ప్రారంభించామని, పట్టణంలోని అన్ని ప్రధాన జంక్షన్లలో వీటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నియమాలను పాటించి, మదనపల్లిని రోడ్డు ప్రమాదాలు రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ బూత్‌ల ఏర్పాటు వల్ల పోలీసుల ఉనికి కూడళ్లలో స్పష్టంగా కనిపిస్తుందని, ఇది నేర నియంత్రణకు కూడా దోహదపడుతుంద న్నారు.

ఇందులో భాగంగా జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.వెంకటాద్రి పాల్గొని ట్రాఫిక్ బూత్‌ల పనితీరును పరిశీలించారు. మదనపల్లి డీఎస్పీ బి.పావని, ట్రాఫిక్ సీఐ గురునాథ్, ఎస్‌బి సీఐ పి.రాజా రమేష్, మదనపల్లి వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి, ట్రాఫిక్ ఎస్.ఐ గాయత్రి, ట్రాఫిక్ ఆర్‌ఎస్ఐ జి.రవి, శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ కుమార్ మరియు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేసవి విజ్ఞాన శిబిరంతో విద్యార్థులకు ఉల్లాసం, విజ్ఞానం

## - గ్రంథాలయ అధికారి బి.చంద్రశేఖర్ స్పష్టం



కురబలకోట (ప్రజా సీమ) : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి ఆదేశాల మేరకు కురబలకోట శాఖ గ్రంథాలయం నందు ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఆహ్లాదకర వాతావరణంలో జరుగుతోంది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ బాలల దశ నుండి పుస్తక పఠనాశక్తిని పెంపొందించుట విజ్ఞాన వికాసాన్ని పెంపొందించుట ఈ శిబిరం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా 8 ఈరోజైన మంగళవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, కథలు, మ్యాథ్స్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ యోగ మొదలైన అంశాలపై ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారన్నారు. జూన్ 6వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల ఈ విజ్ఞాన శిబిరం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాలలోని విద్యార్థిని, విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులు వేసవి సెలవులను వృధా చేసుకోకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ఉపాధ్యాయురాలు ఎం.లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉరుసు మహోత్సవం కు సర్వం సిద్ధం

## - కులమతాలకు అతీతంగా ఆదర్శంగా దర్గా ఉరుసు మహోత్సవం

## - అన్ని ఏర్పాట్లు చేసిన పీఠాధిపతులు







చిట్వేలి (ప్రజా సీమ) : కుల మతాలకు అతీతంగా ఎంతో చరిత్ర కలిగిన దర్గా ఉరుసు మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధల తో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఉరుసు నిర్వాహకులు చేపడుతున్న కార్యక్రమాల విషయాలు ప్రజలకు తెలియజేసి మండల ప్రజలే కాక సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇది ఎక్కడ అనుకుంటున్నారా అతి పురాతనమైన శ్రీ శ్రీ హాజరత్ జనాబ్ సయ్యద్ షా సాధక్వలి, దర్గా ఉరుసు మహోత్సవం చిట్వేలి నడిబొడ్డున సింగనమల వీధిలో కొలువుతీరిన హాజరత్ జనాబ్ సయ్యద్ షా ఉరుసు మహోత్సవం చుట్టుపక్కల ప్రాంతాలకు యొక్క ఉరుసు మహోత్సవం గతంలో ఎంతగానో చరిత్ర ఉన్న ఉరుసుగా పేరుగాంచింది. ముఖ్యంగా ఇక్కడ అనారోగ్యాలతో ఉన్నవారు. దర్గాలోని ఏళ్ల తరబడి నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తూ దర్గాలో ప్రార్థనలు చేస్తూ జీవనం సాగించేవారు ఇప్పటికీ ఉన్నారు. గాలి ధూళి పట్టిన వారికి ఇక్కడ విముక్తి దొరుకుతుందని ప్రజల ప్రగాఢ నమ్మకం అందుకే ఇప్పటికి దర్గాలో అలాంటివారు ఉన్నారు. ఒకప్పుడు ఈ దర్గాలో ఉరుసు జరుగుతుందంటే అది ఒక సంబరం లా ఉండేది గత 20 సంవత్సరాల క్రితం ఉరుసు గురించి ఊరు ఊరు ప్రచారం జరిగేది. గంధం రోజు భక్తులు ఇక్కడికి చేరుకుని ఉరుసు మహోత్సవం మరుసటి రోజు కంకర్యాలన్నీ తిలకించి పీఠాధిపతుల గృహం నుండి రాత్రి సమయంలో గంధం దర్గాకు తీసుకువచ్చే వైభవాన్ని తిలకించేవారు. రాను రాను ఆ వైభవం కనుమరుగయింది. కానీ ఆ దర్గాకు సంబంధించిన పీఠాధిపతులు వారికి వారసత్వంగా వస్తున్న ఈ యొక్క మహోత్సవాన్ని మాత్రం నిర్వహిస్తూ ఉన్నారు. ఈనెల 6,7, తేదీలలో ఆరవ తేదీ గంధం, ఏడవ తేదీ ఉరుసు మహోత్సవం జరగనున్నట్లు నిర్వాహకులు తెలియజేస్తున్నారు.

# దేశ అభివృద్ధిలో యువత క్రియాశీలక పాత్ర పోషించాలి

## - మిట్స్ వర్శిటీలో ఘనంగా ప్రపంచ మేధోసంపత్తి దినోత్సవం





కురబలకోట (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలోని (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలోని ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ (మిట్స్ - ఐ.పి.ఎఫ్.సి) మరియు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్, ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసి) వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మేధోసంపత్తి దినోత్సవం - 2026 వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కె.పద్మనాభం, సీఈఓ, పవర్ ఎంపవర్ సొల్యూషన్స్, పలమనేరు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల రంగంలో ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, బ్రాండింగ్ మరియు పేటెంట్ల పాత్ర ఎంతో కీలకమని, యువత ఆవిష్కరణలకు ప్రోత్సాహమివ్వడం ద్వారా దేశ అభివృద్ధికి దోహదపడతాయన్నారు. పవన్ ఎంపవర్ సొల్యూషన్స్ సంస్థ చేపడుతున్న చౌకైన ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, పునరుత్పాదక శక్తి పరిష్కారాలు మరియు సామాజిక ఉపయోగాల కోసం రూపొందించిన సాంకేతిక పరికరాల గురించి వివరిస్తూ, గ్రామీణస్థాయి ఆలోచనలను స్టార్టప్‌లుగా అభివృద్ధి చేయడానికి ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌లు మరియు పరిశ్రమ - విద్యాసంస్థల భాగస్వామ్యం అవసరమన్నారు. ఆవిష్కరణ ఆధారిత వ్యవస్థాపకత, మేధస్సు హక్కుల సంరక్షణ మరియు సమాజ అభివృద్ధికి అవసరమైన సాంకేతిక పరిష్కారాలపై విద్యార్థులకు అవగాహన కలిపించారు. నవ భారత్ నిర్మాణంలో మేధో సంపత్తి హక్కుల పరిరక్షణే పునాది అని, ప్రతి ఒక్కరూ తమ వినూత్న ఆలోచనలకు రక్షణ కల్పించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, అడ్వైజర్ (ఆర్ అండ్ డి) డాక్టర్ తులసిరామ్ నాయుడు, అసోసియేట్ డీన్ (ఆర్ అండ్ డి) డాక్టర్ పి.శివయ్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# "మీ భద్రత మా బాధ్యత" -- మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం



పుల్లంపేట, ప్రజాసేవ న్యూస్: తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలో మహిళల భద్రత, సంక్షేమంపై చైతన్యం కల్పించేందుకు "మీ భద్రత మా బాధ్యత" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఎస్వీ కళ్యాణమండపంలో నిర్వహించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో, మండల అభివృద్ధి అధికారి, తాసిల్దార్ , ఐసిడిఎస్ మరియు ఆరోగ్యశాఖల సంయుక్త సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐ శ్రీనివాసులు మాట్లాడుతూ, మహిళలపై జరుగుతున్న వేధింపులను అరికట్టడంలో పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మహిళలు ఎటువంటి భయం లేకుండా తమ సమస్యలను పోలీసులకు తెలియజేయాలని, షీ టీమ్స్, అత్యవసర హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మండల అభివృద్ధి అధికారి జయశ్రీ మాట్లాడుతూ, మహిళల భద్రతకు గ్రామ స్థాయిలోనే బలమైన వ్యవస్థ ఏర్పడాలని, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. తాసిల్దార్ పుల్లారెడ్డి మాట్లాడుతూ, మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, సమస్యల పరిష్కారంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. ఐసిడిఎస్ సీడీపీఓ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మహిళలు, బాలికల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, గ్రామ స్థాయిలో మరింత విస్తృతంగా సేవలు అందించేందుకు కృషి జరుగుతోందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ అశ్విన్ చంద్ర, ఎస్సై చిన్న రెడ్డప్ప, పోలీసు సిబ్బంది, షీ టీమ్స్, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# బిజెపి ఘన విజయంపై హర్షణీయం

## - జనసేన నేత దాసరి రవిశంకర్




వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బిజెపి ఘన విజయం సాధించడంపై జనసేన నేత దాసరి రవిశంకర్ హర్షణీయమని వెల్లడించారు. నాల్గు రాష్ట్రాలతో పాటు ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. తుది ఫలితాల్లో బిజెపి విజయంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. గత పదహేనేళ్ల నుంచి మమతా బెనర్జీ పాలించిన పశ్చిమ బెంగాల్ ని ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా ల కృషితో పశ్చిమ బెంగాల్ ని బిజెపి కైవసం చేసుకుందన్నారు. అస్సాం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లి మరోసారి విజయాన్ని సొంతం చేసుకుందన్నారు. పుదుచ్చేరిలో కూడా బిజెపి ఘన విజయం సాధించిందన్నారు. ప్రధాని మోడీ, అమిత్ షా వ్యూహాత్మక నాయకత్వంతో బిజెపి దేశవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. భవిష్యత్ లో కూడా మరింత బలపడుతూ దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్కడక్కడా ఒక్కరున్నా చాలు!

## - వేలాదిమంది వ్యాధిగ్రస్థులకు కొత్త జీవితం ఇస్తున్న డాక్టర్ మురళీకృష్ణ
## - మూడు మందుల బదులు రెండింటితోనే సమాన ఫలితాలు
## - వైద్య రంగంలో కాకినాడ డాక్టర్ నిశ్శబ్ద విప్లవం




ఏపీ బ్యూరో (ప్రజాసీమ): కాకినాడలోని ఒక చిన్న క్లినిక్‌లో ప్రారంభమైన ఒక నిశ్శబ్ద విప్లవం ఇప్పుడు ప్రపంచ వైద్య విధానాలనే పునఃసమీక్షించాల్సిన పరిస్థితిని తీసుకొచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ప్రాణాంతక వ్యాధుల చికిత్స అంటే ఖరీదైన లాబొరేటరీ పరీక్షలు, క్లిష్టమైన మందుల కాంబినేషన్లు తప్పనిసరిగా భావించే పరిస్థితుల్లో ఒక స్వతంత్ర వైద్యుడు మనకున్న పరిమిత సంఖ్యలోని చౌకైన ఔషధాలు, అందుబాటులోని చిన్న పరీక్షలతోనే ఆరోగ్యాన్ని సంరక్షించే ఆలోచన చేసి ఆచరణలో పెట్టారు. ఎలాంటి పెద్ద సంస్థల సహకారం, పరిశోధకుల బృందం లేకుండా ఒంటరిగా ఆలోచించి, అమలు చేసి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పరిశోధనతో కాకినాడకు చెందిన డాక్టర్ యనమడల మురళీకృష్ణ ఒక నిశ్శబ్ద వైద్య విప్లవాన్ని సృష్టించారు. ఇది కేవలం ఒక పరిశోధన కాదు... వేల మంది ప్రాణాలను నిలబెట్టిన జీవిత యాత్ర. ఈయన లాంటి దృక్పథం ఉన్న వైద్యులు అక్కడొకరు, అక్కడొకరు ఉన్నా వైద్య రంగంలో వ్యాధిగ్రస్థులకు అనువైన విప్లవాత్మక మార్పులు ఎన్నో వస్తాయి.

**నూటికి 88 మందిని బతికించారు**

2000 సంవత్సరం నుంచి చికిత్స పొందుతున్న 7,000 మందిలో నిరంతర పర్యవేక్షణలో ఉన్న 971 మంది రోగులపై చేసిన విశ్లేషణలో 88.3 శాతం సర్వైవల్ రేటు నమోదవడం వైద్య రంగానికే ఆశ్చర్యాన్ని కలిగించింది. వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా క్రమబద్ధమైన సంరక్షణతో దీర్ఘకాలిక మనుగడ సాధ్యమని ఈ ఫలితాలు స్పష్టంగా చాటాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రామాణికంగా అమలవుతున్న మూడు రకాల మందుల థెరపీకి భిన్నంగా, జాగ్రత్తగా ఎంపిక చేసిన రెండు రకాల మందుల కలయికతోనే సమాన ఫలితాలను సాధించవచ్చని ఆయన నిరూపించడం వైద్య విధానాలపై పెద్ద ప్రశ్నలే లేవనెత్తుతోంది.

**ఒక్కొక్కరి ఖర్చు రూ.7 లక్షలు తగ్గింది**


ఖరీదైన పరీక్షలపై ఆధారపడకుండా నిరంతర క్లినికల్ మూల్యాంకనం, రోగి పరిస్థితిని దగ్గరగా పర్యవేక్షించడం ద్వారా తీసుకున్న నిర్ణయాలు ఈ విజయానికి మూలం అయ్యాయి. ఈ విధానంతో 25 ఏళ్ల కాలంలో ఒక్కో రోగికి సుమారు రూ.7 లక్షల వరకు ఖర్చు తగ్గింది. అదే సమయంలో వ్యూహాత్మకంగా మందుల వినియోగాన్ని మారుస్తూ వైరల్ రెసిస్టెన్స్‌ను సమర్థవంతంగా అరికట్టగలిగారు. ఫలితంగా క్షయ, న్యుమోనియా వంటి ప్రాణాంతక ఇన్ఫెక్షన్ల రేటు 1,000 మందికి 451.5 నుండి 69.7కి తగ్గిపోవడం ఈ పరిశోధన గొప్పతనాన్ని చాటుతోంది.

**డాక్టర్ మానవీయత, పేషెంట్ల విశ్వసనీయతే అసలు బలం**

పేషెంట్లపై డాక్టరుకున్న మానవీయ దృక్పథం, పేషెంట్లకు డాక్టరుపై ఉన్న నమ్మకమే ఈ విజయానికి అసలు కారణం. నిరంతర కౌన్సెలింగ్ వల్లే 85 శాతం మంది రోగులు మందులను క్రమం తప్పకుండా వాడగలిగారు. క్లినికల్ ప్రోటోకాల్‌లలో తరచుగా విస్మరించబడే ఈ మానవీయ కోణమే దీర్ఘకాలిక విజయానికి కీలకంగా మారింది. మందులు మాత్రమే కాదు, నమ్మకమే అసలు ఔషధమని ఈ ప్రయోగం నిరూపించింది. ఈ నేపథ్యంలో డాక్టర్ మురళీకృష్ణ "ప్రజాసీమ"తో మాట్లాడారు. "ఖరీదైన వనరులు లేకపోయినా, అంకితభావంతో కూడిన సంరక్షణ, సరైన క్లినికల్ నిర్ణయాలతో ప్రాణాంతక వ్యాధులను ధైర్యంగా ఎదుర్కోవచ్చు. నా 25 ఏళ్ల ప్రయాణం అదే చెప్పింది" అని పేర్కొన్నారు. ఇంకా సాంక్రమిక వ్యాధులు ప్రబలి వుండే మన దేశం వంటి చోట్ల క్షయ, న్యూమోసిస్టిస్ న్యూమోనియాలకుముందస్తు నిరోధక ఔషధాలను ఇవ్వనవసరం లేదని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఖరీదైన పరీక్షలు, క్లిష్టమైన చికిత్సలే మార్గమా? లేక సరైన వైద్య నిర్ణయాలు, నమ్మకమే అసలు పరిష్కారమా? పేదలకు అందుబాటులో ఉండే ఈ విధానాన్ని ఎందుకు ప్రామాణికంగా మార్చకూడదు? అనే కఠిన ప్రశ్నలకు ఈ సక్సెస్ స్టోరీ సమాధానాలు అడుగుతోంది.

# డైనింగ్ హాల్, వంటగది ఏర్పాటుకు కృషి చేయండి

## - టిడిపి ఇంఛార్జీ రఘునాథ్ రెడ్డికీ హెచ్ఎం, ఉపాధ్యాయులు వినతి



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు సంబంధించి మధ్యాహ్న భోజన సదుపాయానికీ అవసరమైన డైనింగ్ హాల్, వంటగది ఏర్పాటుకు కృషి చేయాలని వేంపల్లె మండలం తెలుగుదేశం పార్టీ ఇంఛార్జీ అజ్జగుట్టు రఘునాథ్ రెడ్డిని పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులరెడ్డి, ఉపాధ్యాయుడు ధర్మారెడ్డి కోరారు. మంగళవారం వినతిపత్రాన్ని అందజేసి, విధ్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 850 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వీరందరికీ నూతన భవన సదుపాయాలు కల్పించినప్పటికీ మధ్యాహ్నం భోజనం ఏర్పాటుకు అవసరమైన వంటగది, భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ లేకపోవడంతో విధ్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. తుఫాను, వర్షాలు కురిసినప్పుడు విధ్యార్థులు తడుస్తూ భోజనం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వెల్లడించారు. అలాగే సాధారణ సమయంలో క్రీడా మైదానం, చెట్ల కింద, నెలపై కూర్చుని తినడం వల్ల దుమ్ము, ధూళి తమ భోజన ప్లేట్ ల్లో పడడంచేత ఆహారాన్ని డస్ట్ బిన్ లలో పడేస్తున్నారని, దీంతో విధ్యార్థులు పస్తులు ఉన్న సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. వీటన్నింటినీ గుర్తించి విధ్యార్థుల సౌకర్యార్థం డైనింగ్ హాల్, వంట గది ఏర్పాటుకు కృషి చేయాలని రఘునాథ్ రెడ్డికి విన్నవించారు. దీంతో స్పందించిన ఆయన వీటి పరిష్కారానికి తక్షణమే కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, విద్యార్థులకీ అవసరమైన మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ స్టాలిన్ ఐజాక్, ఉపాధ్యాయులు కృష్ణవేణి, టిడిపి నాయకులు వేమాకుమార్, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గాలేరునగరి ప్రాజెక్ట్ పై నిర్లక్ష్యం తగదు


## - సిపిఐ నేతలు పి.చంద్రశేఖర్, వెంకట రాములు



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: గాలేరునగరి ప్రాజెక్ట్ పై సిఎం చంద్రబాబు నిర్లక్ష్యం తగదని సిపిసి జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్, ప్రాంతీయ కార్యదర్శి వెంకట రాములు అన్నారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏడు ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకు రూ.11496 కోట్లు అంచనా వ్యయంతో పూర్తి చేయనున్నట్లు ప్రకటించడంపై రాయలసీమ పట్ల పూర్తి నిర్లక్ష్యం బహిర్గతం అవుతుందన్నారు. గాలేరునగరి పట్ల చిత్తశుద్ధి లోపం, రాయలసీమ ఎత్తిపోతలపై శాస్వత మరణ శాసనం కనిపిస్తోందన్నారు. ఆ వైఖరిని మార్చుకోక పోతే ప్రజా ఉద్యమం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ప్రాంతీయ సహాయ కార్యదర్శులు బ్రహ్మం, అంజనప్ప, నాయకులు చాంద్ బాషా, జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేలకొరిగిన పంట,మిగిలింది కన్నీరు రైతు కంట

## - చేతికి వచ్చిన పంట నేలకొరిగిన అరటి
## - ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

చిట్వేలి (ప్రజా సీమ) : చిట్వేలి మండల, పరిధిలోని చిల్ల వాండ్ల పల్లి, గ్రామానికి చెందినసానేపల్లి రామచంద్ర , గ్రామంలో సోమవారం ,రాత్రి కురిసిన అకాల వర్షం, గాలివాన రైతు కుటుంబాన్ని దెబ్బతీసింది. గ్రామానికి చెందిన రైతు ఎంతో కష్టపడి సాగు చేసిన అరటి తోట ఒక్కరాత్రిలో నేలమట్టమైంది. అప్పులు గుదిబండగా మారింది, దాదాపు 8 ఎకరాల్లో సాగుచేసిన అరటి పంట కోత దశకు చేరుకున్న సమయంలో ప్రకృతి విరుచుకుపడటంతో మొత్తం పంట కిందపడిపోయింది. సుమారు రూ.20 లక్షల విలువైన పంట నష్టం వాటిల్లిందని బాధిత రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. "ఏడాది పాటు శ్రమించి పండించిన పంట ఒక్క రాత్రిలో నాశనం అయింది అని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు" అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. రైతు కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడింది. రెప్పపాటు క్షణంలో ఆ రైతు కంట కన్నీరు మిగిల్చింది ప్రకృతి విలయతాండవం చేయడంతో ఆ రైతు నష్టాల పాలు అవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన రాజంపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు



రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగం శెట్టి కృష్ణకుమార్ నేతృత్వంలో ఈ రోజు అనగా 5 వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతం లో హైకోర్టు న్యాయమూర్తి మరియు కడప జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కె.శ్రీనివాసుల రెడ్డి ని రాజంపేట ప్రాంతం లో జన్మించి హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మెడమల్లి బాలాజీ నీ కలిసి రాజంపేట కోర్టు కు సంబంధించిన సమస్యలు విన్నవించడం జరిగింది..సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన న్యాయమూర్తులు తొందరలోనే మీ సమస్యలను తీర్చుతామని ఇందుకు సంబంధించి కడప జిల్లా కలెక్టర్ కి కూడా చెప్పామని వారు కూడా పాజిటివ్ గా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కృష్ణ కుమార్ తో పాటు మాజీ అధ్యక్షులు ఏబీ.సుదర్శన్ రెడ్డి.శ్రీ టి.రఘునాథ రెడ్డి .తరిగోపుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.. అటు తర్వాత గౌరవ న్యాయమూర్తులను ఘనంగా సన్మానించారు.

# తాగునీటి ఎద్దడి నివారణపై ప్రత్యేక శ్రద్ధ

## - టిడిపి మండల ఇంచార్జీ రఘునాథ్ రెడ్డి



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:తాగునీటి ఎద్దడి నివారణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలుగుదేశం పార్టీ వేంపల్లె మండల ఇంచార్జీ రఘునాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని టి.వెలమవారిపల్లి గ్రామంలో తాగునీటి సౌకరాన్ని మెరుగు పరిచేందుకు కొత్త బోరును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిదృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంతోనే ప్రజాపాలన సాధ్యమన్నారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామమునిరెడ్డి, వీరభద్ర, రామాంజీరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వేమాకుమార్, డక్కారమేష్, మహమ్మద్, రాజా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# దేవాలయాలే లక్ష్యంగా మహారాష్ట్ర గ్యాంగ్ దోపిడీలు

## - అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులు - 4 కిలోల వెండి,బంగారు ఆభరణాలు స్వాధీనం - వివరాలు వెల్లడించిన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి






మదనపల్లె (ప్రజా సీమ) : దేవాలయాలే లక్ష్యంగా చేసుకొని తెలుగు రాష్ట్రాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న మహారాష్ట్రకు చెందిన ఒక ప్రమాదకర అంతర్రాష్ట్ర దొంగల ముఠాను మదనపల్లె పోలీసులు అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు.నిందితుల వద్ద నుండి సుమారు 4 కిలోల వెండి వస్తువులతోపాటు బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.గత కొంతకాలంగా జిల్లాలోని పలు దేవాలయాల్లో జరుగుతున్న దొంగతనాలను సీరియస్ గా తీసుకున్న ఎస్పీ ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.ఈ క్రమంలో మే 4వ తేదీ మదనపల్లె పట్టణంలోని చంద్రకాలనీ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వారిని పోలీసు శైలిలో విచారించగా, మహారాష్ట్రకు చెందిన అనికేత్ కైలాస్ కసరోడే (27),సునీల్ దేవరావు సూర్యవంశీ (24),మనీష్ గోపాల్ వడివే (21),ప్రకాష్ మన్నారం ఖరే (18) అని తేలింది.వీరంతా ఒక ముఠాగా ఏర్పడి రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఆలయాల్లో హుండీలను,విగ్రహాల ఆభరణాలను దోచుకుంటున్నట్లు అంగీకరించారు.నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు వారి వద్ద నుండి 3 వెండి కిరీటాలు,శాటారి,శంఖం, చక్రం,పంచామృత గిన్నె వంటి సుమారు 4 కిలోల వెండి వస్తువులతోపాటు,3 బంగారు తాళిబొట్లు,2 బంగారు గిన్నె,బొట్లను (దాదాపు 5 లక్షలు) విలువైన వి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ ముఠా వాయల్పాడు,బత్తలపల్లితోపాటు గుంటూరు,ఒంగోలు జిల్లాల్లోనూ చేతివాటం ప్రదర్శించినట్లు విచారణలో వెల్లడైంది.క్లిష్టమైన ఈ కేసును ఛేదించడంలో చొరవ చూపిన మదనపల్లె డీఎస్పీ బి.పావని,టూ టౌన్ సీఐ ఎస్.మహమ్మద్ రఫీ,ఎస్ఐలు నాగేశ్వర రావు,రామాంజ నేయులు,హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు,క్రైమ్ టీం సభ్యులు భద్రా నాయక్,హరిశంకర్ రెడ్డిలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ ప్రజలకు,ఆలయ నిర్వాహకులకు పలు సూచనలు చేస్తూ దేవాలయాల రక్షణ బాధ్యత కేవలం పోలీసులదే కాదు,ఆలయ కమిటీలు,భక్తుల సహకారం కూడా అత్యవసరం.ప్రతి చిన్న దేవాలయం లోనూ తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.అలాగే హుండీ నగదును ఎప్పటికప్పుడు బ్యాంకుల్లో జమ చేయాలి.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.వెంకటాద్రి,మదనపల్లె డిఎస్పీ బి.పావని,టూ టౌన్ సీఐ ఎస్.మహమ్మద్ రఫీ,ఎస్ఐలు,నాగేశ్వర రావు,రామాంజనేయులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో రాష్ట్ర ర్యాంకర్ కీ ఘన సత్కారం

## - గ్రామీణ విధ్యార్థులకు స్పూర్తిని నింపింది
## - ఎస్టీయూఏపీ జిల్లా అధ్యక్షుడు సంగమేశ్వర రెడ్డి




వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: పది ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంక్ ని సాధించిన చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి లక్ష్మి వెంకటేశ్వర్(595)ని ఎస్టీయూఏపీ రాష్ట్రోపాధ్యాయ సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆ సంఘం ప్రాంతీయ కన్వీనర్ ప్రతాపరెడ్డి అధ్యక్షతన సత్కార సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నర్రెడ్డి సంగమేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విధ్యార్థి సాధించిన ఈ విజయం గ్రామీణ ప్రాంతాల విధ్యార్థులకు స్పూర్తిని నింపిందన్నారు. అలాగే నాగులగుట్టపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కూడా అందుకు దోహదమన్నారు. ప్రధానంగా సైన్స్ ఉపాధ్యాయుడు అశోక్ రెడ్డి ప్రత్యేకంగా ప్రతిభ కలిగిన విధ్యార్థులపై శ్రద్ధ వహించి వీరిని రాష్ట్ర, జిల్లాస్థాయి కాంపిటీషన్ లలో విజేతలుగా నిలిపుతూ ఆ పాఠశాల నుండి పదోతరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకర్ గా నిలవడం వెనుక ఉన్న ఉపాధ్యాయులను అభినందించారు. అంతేకాకుండా విధ్యార్థి లక్ష్మి వెంకటేశ్వర్ తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. విధ్యార్థికీ భవిష్యత్ లో ఉన్నత చదువులకు అండగా ఉంటామని వెల్లడించారు. రాష్ట్ర కన్వీనర్ శివారెడ్డి రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతిని విధ్యార్థికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రంగారెడ్డి, గోవిందు, శ్రీనివాసరెడ్డి, జనార్ధన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మణి, సుబ్రమణ్యం, ధర్మారెడ్డి, పవన్, రామకృష్ణ, సుబ్బారెడ్డి, మురళి, రవి, ఆదినారాయణ, గోవర్ధన్, హెచ్ఎంలు చంద్రమోహన్ రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన రైల్వే అండర్ బ్రిడ్జి పనులు





రాజంపేట, (ప్రజా సీమ) : ఈ నెల 7వ తేదీ అంగరంగ వైభవంగా జరిగే శ్రీ శ్రీ గంగమ్మ తల్లి బలిజపల్లి జాతరకు అగ్రహారం గ్రామస్తులు, మహిళలు పోవడానికి వీలుగా రైల్వే అండర్ బ్రిడ్జి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసిన పనులను వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు, శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి , మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసు రెడ్డి గారు,రైల్వే గుంతకల్లు డిఆర్సిసి సభ్యులు, రాయలసీమ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రాజు, విశ్వనాధ్ రెడ్డి,కళ్యాణ్ రెడ్డి,దండు గోపి, సుబ్బరాజు, అమర్, సురేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ కృషి అమోఘం

## - లాక్మీ అకాడమీ నిర్వాహకులు సత్రశాల వెంకటేష్ బాబు,సౌజన్య ప్రశంసలు
## - ట్రాఫిక్ నియంత్రణకై కంట్రోల్ బూత్‌లు వితరణ
## - హాజరైన శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ అధినేత అజయ్ కుమార్









మదనపల్లె (ప్రజా సీమ) : సమాజ శ్రేయస్సులో పోలీసులు పాత్ర అద్వితీయమని అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణానికి చెందిన లాక్మీ అకాడమీ నిర్వాహకులు సత్రశాల వెంకటేష్ బాబు,సౌజన్యలు పేర్కొన్నారు.పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ,పోలీసులు ఆరోగ్య పరిరక్షణకై కంట్రోల్ బూత్‌లు వితరణ చేశారు.ఈ కంట్రోల్ బూత్‌లను మంగళవారం జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి లాంఛనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ కుమార్ సంస్థ అధ్యాపకులు మరియు విద్యార్థులు హాజరై తమ సహకారాన్ని అందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల సంక్షేమానికి కంట్రోల్ బూత్‌లు వితరణ చేసిన లాక్మీ అకాడమీ వారి చొరవ ప్రశంసనీయమన్నారు.ఏపీలోనే మొట్టమొదటి లాక్మీ అకాడమీని మదనపల్లెలో ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతులకి బ్యూటీషన్ కోర్సులు నేర్పిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని అభినందించారు.వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది పోలీస్ శాఖ అభివృద్ధికి సహకరించాలని కోరారు.అనంతరం వెంకటేష్,సౌజన్యలు మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు,శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తున్న పోలీసులను అందరూ గౌరవించాలన్నారు.మా అకాడమీ తరుపున కంట్రోల్ బూత్‌లు వారికి అందజేయడం ఆనందంగా ఉందన్నారు.జిల్లా కేంద్రమైన మదనపల్లి శరవేగంగా విస్తరిస్తోందని,ఈ కంట్రోల్ బూత్‌లు పోలీసులకు ఎంతో దోహదపడతాయని వారు స్పష్టం చేశారు.అదేవిధంగా మా లాక్మీ అకాడమీలో వినూత్నమైన బ్యూటీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని,ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతులు సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.వెంకటాద్రి,డీఎస్పీ బి.పావని,ట్రాఫిక్ సీఐ గురునాథ్,ఎస్‌బి సీఐ పి.రాజా రమేష్,మదనపల్లి వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి,ట్రాఫిక్ ఎస్.ఐ గాయత్రి,ట్రాఫిక్ ఆర్ఎస్ఐ జి.రవి,వెలుగు సెక్రటరీ ఉదయ మోహన్ రెడ్డి మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


# ఒంగోలు నగర అభివృద్ధి, సుందరీకరణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతం చేయాలి

ఒంగోలు, మే 5 : ఒంగోలు నగర అభివృద్ధి, సుందరీకరణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మరియు కార్పొరేషన్ ప్రత్యేక అధికారి శ్రీ.పి.రాజాబాబు స్పష్టం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఒంగోలు పురపాలక సంఘం ఏర్పడి 150 ఏళ్లు పూర్తి కాబోతున్న దృష్ట్యా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల పురగతిపై సందర్భంగా ఆయన ఆరా తీశారు. కార్పొరేషన్ నిర్వహిస్తున్న ఆయా కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా వారికి మరింత అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ప్రజల ప్రవర్తనలో మరింత సానుకూల మార్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. నగరంలో అవసరమైన కొత్త టాయిలెట్లు నిర్మించడంతో పాటు మరమ్మతులు అవసరమైన వాటికి తక్షణమే చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. చిరు వ్యాపారాల కోసం ప్రత్యేక వెండింగ్, పార్కింగ్ ప్రాంతాలను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఈ 150 ఏళ్ల ఉత్సవాలను ప్రతిబింబించేలా గాంధీ పార్కులో ప్రతివారం వివిధ ఇతివృత్తాలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# నామకరణోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

## - ఘనస్వాగతం పలికిన వైసిపి నాయకులు,ప్రజలు





పెద్దమండ్యం (ప్రజా సీమ) : పెద్దమండ్యం మండలం, బండమీదపల్లి పంచాయితీ, బండమీదపల్లిలో వైఎస్సార్సీపీ నాయకులు బి.సుధాకర్ కుమార్తె నామకరణ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి తంబళ్లపల్లె శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముందుగా ఎమ్మెల్యేకి బి.సుధాకర్ కుటుంబ సభ్యులు,స్థానిక వైసిపి నాయకులు ఘన స్వాగతం పలికారు.అనంతరం చిన్నారిని ఆశీర్వదించారు. ఇందులో భాగంగా స్థానిక నాయకులతో కాసేపు ముచ్చటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు.ఇప్పటికే నియోజకవర్గాన్ని గణనీయమైన అభివృద్ధి చేశామని తెలిపారు. వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. తనను ఆదరిస్తున్న నియోజకవర్గంలో ప్రజలు,వైసీపీ శ్రేణులకు రుణపడి ఉంటానని స్పష్టం చేశారు.వైఎస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు,ప్రజలు తరలిరావడంతో బండమీద పల్లెలో సందడి వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో వైకాపా మండల అధ్యక్షులు రెడ్డెప్ప రెడ్డి,సగినాల కేశవ,బాషా,సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# ఉదయగిరి పట్టణంలో దాహార్తి తీర్చడానికి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి సంబంధించి అంచనా వ్యయం ఎన్ని లీటర్ల కెపాసిటీ కావాలి



నెల్లూరు,(ప్రజా సీమ) మే 5 : ఉదయగిరి పట్టణంలో దాహార్తి తీర్చడానికి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి సంబంధించి అంచనా వ్యయం ఎన్ని లీటర్ల కెపాసిటీ కావాలి తదితర వివరాలతో సమగ్ర ప్రణాళిక రూపొందించి నివేదిక అందచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ తో కలిసి ఇరిగేషన్ అధికారులు, నియోజకవర్గ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు కాకర్ల సురేష్ లేవనెత్తిన పలు అంశాలపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఇరిగేషన్ కెనాల్స్ ఏర్పాటులో అవసరమైన ల్యాండ్ ఎక్విజిషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని అంతేకాకుండా పరిపాలన అనుమతులు విషయంలో జాప్యం ఉండకూడదని అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు, గ్రామీణ నీటి సరఫరా, జాతీయ ఉపాధి హామీ పథకం, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి, తదితర శాఖల అధికారులతో వివరంగా సమీక్షించి నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. నియోజకవర్గానికి సంబంధించి మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టును లక్ష్యాలు గనుగుణంగా మంజూరు చేయడం జరుగుతుందని దరఖాస్తు చేసుకున్న వాళ్లకి సబ్సిడీ కూడా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గం శాసనసభ్యులు కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గం బాగా వెనుకబడిన ప్రాంతమని, మెట్ట ప్రాంతం అని త్రాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ఈ విషయమై ఆయా శాఖ అధికారులు జిల్లా అధికారులు మరియు జిల్లా కలెక్టర్ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. నియోజకవర్గంలో ఉత్తమవుతున్న తాగునీటి సాగునీటి మరియు విద్యుత్ లైన్మెన్లు విద్యుత్ సరఫరా అంతరాయాలను తొలగించే విధంగా అధికారులు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారి దేశీ నాయక్,గ్రాముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీధర్ రెడ్డి, నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్, ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి పావని, డిపిఓ వసుమతి, డి ఎఫ్ ఓ హుస్సేన్ , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వంశీకృష్ణ, కేశవర్ధన్ రెడ్డి మరియు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మీరంతా మట్టిలో మాణిక్యాలు

**- పేద కుటుంబాల నుంచి వచ్చి.. టెన్త్ లో టాప్ మార్కులు తెచ్చుకున్నారు**

**- ఇంకా కష్టపడండి - ప్రభుత్వం అండగా ఉంటుంది**

**- విద్యార్థులకు భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**

**- డివిజన్ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, హెచ్ఎం లకు సన్మానం**









కందుకూరు, (ప్రజా సీమ) మే 5 : ఇటీవల జరిగిన 10వ తరగతి పరీక్షల్లో, కందుకూరు డివిజన్ స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం ఘనంగా సత్కరించి అభినందించారు. తాటితోటి సాయిలక్ష్మి జస్వంతి (590), వీరేపల్లి మోడల్ స్కూల్ - ఉలవపాడు మండలం కటారి శ్రీకన్య (587), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కరేడు - ఉలవపాడు మండలం జి. హేమశ్రీ (587), జి మేకపాడు మోడల్ స్కూల్ - కందుకూరు మండలం కే. శివప్రసాద్ (585), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొమ్మి - కొండాపురం మండలం మేడసాని మోక్ష సాయిశ్రీ (585), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిమ్మారెడ్డిపల్లి - వరికుంటపాడు మండలం. బాలం వెంకటసాయి హరిత ఆర్తి (584), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - లింగసముద్రం. కందుకూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, ఈ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల హెచ్ఎం లను ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ అభినందన కార్యక్రమం జరిగింది. ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ... విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు చేపట్టిన 100 రోజుల ప్రణాళిక కారణంగా, ఈఏడాది అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు గర్వించదగ్గ స్థాయిలో ఫలితాలను సాధించారని అన్నారు. లోకేష్ గారు ప్రత్యేక దృష్టితో పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించడం కూడా ఒక కారణమన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పుస్తకాలు, బ్యాగులు ఇవ్వడం, నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామన్నారు.

సింగపూర్ లో విద్యావిధానం పరిశీలనకు పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ప్రభుత్వం పంపించడం, అసెంబ్లీలో విధివిధానాలపై అవగాహన పెంచేందుకు విద్యార్థులతో మాకు అసెంబ్లీ నిర్వహించడం లాంటి మంచి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని నాగేశ్వరరావు చెప్పారు. పదవ తరగతిలో మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహం ఉంటుందని ఎమ్మెల్యే తెలియజేశారు. పేద కుటుంబాల నుంచి వచ్చి, టాప్ ఫలితాలు సాధించడం గర్వకారణం అన్నారు. ఇంకా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అందుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను లోకేష్ గారు తీర్చిదిద్దుతున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ నరసింహారావు, ఎంపీడీవో రత్నజ్యోతి, కందుకూరు ఎంఈఓలు శర్మ, సుబ్బారెడ్డి, డివిజన్ పరిధిలోని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గ్రామాలలో స్థానిక సమస్యల సత్వర పరిష్కారం పల్లె వీక్షణం ముఖ్య ఉద్దేశం

**- అప్పసముద్రం గ్రామంలో అన్ని పెట్టేసి ఉన్నావా విద్యుత్ సమస్యలు మరియు పాత చెరువు ఆక్రమణ విషయమై అవసరమైన చర్యలు తీసుకుంటాం - ఎలిమెంటరీ స్కూల్లో జూలై 12 నుంచి ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉపాధ్యాయుల నియామకానికి చర్యలు.... జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల.**





నెల్లూరు,(ప్రజా సీమ) మే 5 : పల్లె వీక్షణం కార్యక్రమంలో భాగంగా మంగళ వారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఉదయగిరి మండలం అప్పసముద్రం పల్లె వీక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు, పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు, అంగన్వాడి కేంద్రం, ప్రతి సేవా కేంద్రం మరియు మెడికల్ క్యాంపు లను మినీ గోకులాన్ని పరిశీలించారు. గ్రామంలోని వీధులలో కలియు తిరుగుతూ గ్రామస్తులను పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆరి కొండ చినమాల కొండయ్య దివ్యాంగునకు ట్రై సైకిల్ మంజూరుకై సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నారాయణమ్మ కోరిన విధంగా పొలం అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారికి ఆయన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం అప్పసముద్రం సచివాలయం వద్ద గ్రామ సభను ఏర్పాటు చేసి గ్రామ సమస్యలను తెలుసుకోవడంతో పాటు ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ పల్లె వీక్షణం ముఖ్య ఉద్దేశం గ్రామంలోని సమస్యలను జిల్లా అధికారులతో కలిసి పరిశీలించి సాధ్యమైనంత మేరా అప్పటికప్పుడే పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవడం అని తెలిపారు. గ్రామస్తులు తెలిపిన పలు అంశాలపై స్పందిస్తూ ఆక్రమణకు గురైన పాత చెరువును క్షుణ్ణంగా పరిశీలించి సరైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదేవిధంగా విద్యుత్ లైన్లు మరియు లైన్మెన్ ల సమస్యలు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులకు అదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అపసముద్రంలోని ప్రైమరీ పాఠశాలలో 1నుంచి ఐదు వరకు విద్యాబోధన చ నేర్పించే విధంగా అధ్యాపకులను నియమించే విధంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా విద్యాశాఖ అధికారికి సూచనలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. నేషనల్ హైవే నుంచి పలు గ్రామాలకు వెళ్ళవలసిన సర్వీస్ రోడ్లు మరియు గ్రావెల్ రోడ్ల విషయమై అధికారులతో చర్చించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో చదువుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థులు వసంత కుమార్ రెడ్డి , నాగ వర్షిత తదితరులకు కలెక్టర్ చేత ప్రశంసా పత్రం అందజేయడంతో పాటు మెమొంటోల్లను కూడా అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి పావని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వంశీకృష్ణ, కేశవర్ధన్ రెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శ్రీధర్ రెడ్డి, డిపిఓ వసుమతి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సత్యవాణి, పరిశీలించారు.

# జలధార - జలహారతి పనులకు వేగం పెంచాలి

**- మంజూరైన పనులన్నీ క్షేత్రస్థాయిలో పూర్తి చేయాలని ఆదేశం**

**- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



నంద్యాల,(ప్రజా సీమ) మే 5 : జిల్లాలో అమలవుతున్న జలధార - జలహారతి కార్యక్రమ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సంబంధిత అధికారులతో కార్యక్రమ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,హౌజలధార - జలహారతిహౌకార్యక్రమ అమలులో వేగం పెంచడంతో పాటు, ప్రతి పని క్షేత్రస్థాయిలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 1952 పనులు మంజూరు కాగా, వాటిలో ప్రస్తుతం 1231 పనులు గ్రౌండింగ్ దశలో ఉన్నాయని తెలిపారు. 'అదర్స్' కేటగిరీలో సుమారు 400 పనులు యాప్‌లో సరిగా ప్రతిబింబించడం లేదని, ఆ సాంకేతిక సమస్య పరిష్కారమైతే గ్రౌండింగ్‌లో ఉన్న పనుల సంఖ్య 1600 దాటుతుందని వివరించారు. పెండింగ్లో ఉన్న పనులను కూడా తక్షణమే గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. స్ట్రక్చర్ ప్లాన్లలో 90 శాతం పూర్తవగా, విలేజ్ ప్లాన్లు 73 శాతం మాత్రమే పూర్తయ్యాయన్నారు. జిల్లాలోని 330 చెరువులు, 191 గ్రామాలకు సంబంధించిన ట్యాంక్ ప్లాన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ఇంకా సుమారు 2,500 స్ట్రక్చర్లను పరిశీలించాల్సి ఉందని, అవి పూర్తయిన తర్వాతే విలేజ్ ప్లాన్లు అప్లోడ్ అవుతాయని స్పష్టం చేశారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్ సమయానికి కేటాయించిన ప్రతి పని క్షేత్రస్థాయిలో అమలు కావాలని, సంబంధిత అధికారులు గ్రామస్థాయికి వెళ్లి ఫోటోలు, జియో కోఆర్డినేట్లు సేకరించి యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. కొలిమిగుండ్ల మండలం హనుమంతుగుండం చెరువు పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సుమారు 18 కిలోమీటర్ల కాలువ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అందులో 14.5 కిలోమీటర్లకు అనుమతులు లభించగా, మిగిలిన 3.5 కిలోమీటర్ల పనులకు సంబంధించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలు చేయలేని పనులకు స్వచ్ఛంద మద్దతు లభిస్తోందని పేర్కొన్నారు.

# తక్కువ వేతనాలు ఇస్తున్న ఇహెచ్ఎస్ఎస్ పై చర్యలు తీసుకోవాలి

### - సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్




కడప,(ప్రజా సీమ) : కడప రిమ్స్ జిజిహెచ్ నందు జిల్లాలో పనిచేస్తున్న సెక్యూరిటీ కార్మికులకు కేవలం రు.12100 మాత్రమే ఇస్తూ సెక్యూరిటీలను ఇబ్బందులకు గురి చేస్తున్న ఈగల్ హంటర్ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీదేవి, మనోహర్, జిల్లా కోశాధికారి వెంకటసుబ్బయ్యలు ఒక సంయుక్త ప్రకటనలో రిమ్స్ అధికారులను డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఎంవోయూ ప్రకారం రు.18600 /కు గాను పీఎఫ్ ,ఈఎస్ఐ పోను రు.13960 /రూపాయలు ఇవ్వాల్సి ఉండగా ,కేవలం రు.12,100 /మాత్రం ఇవ్వడం దారుణమని తెలిపారు . ఎవ్వరు ఏమి చేసుకోలేరనే ధైర్యంతో దుర్మార్గంగా వ్యవహరించడం సరైనది కాదన్నారు అడిగితే తొలగింపులు, బెదిరింపులు , ఈ విధంగా కాంట్రాక్టు వ్యవహరించడం దుర్మార్గం అని తెలిపారు. ఎన్నిసార్లు వారి దృష్టికి తీసుకెళ్లిన చలనం లేదని ఆరోపించారు. రిమ్స్ అధికారులు నిమ్మకు నీరే తిన్నట్లు వ్యవహరించడం దారుణమని తెలిపారు. అంతేకాకుండా పిఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపించారు .సెక్యూరిటీ కార్మికులకు క్యాజువల్ లివ్స్ గానీ ఎలాంటి సెలవులు లేకపోవడం దారుణమని తెలిపారు . కార్మికుల శ్రమను దోచుకుంటూ ,పనికి తగిన వేతనం ఇవ్వని ఈగల్ హంటర్ సెక్యూరిటీ సర్వీస్ యాజమాన్యం పైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# టిడ్కో గృహాలు పంపిణీ చేపట్టాలి

### - ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం

### - జిల్లాప్రధాన కార్యదర్శి వీరనాల శివ నారాయణ

జమ్మలమడుగు,(ప్రజా సీమ):రాష్ట్ర ప్రభుత్వం గూడెం చెరువు వద్ద ఉన్న టిడ్కో గృహాలను ప్రజలకు పంపిణీ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరనాల శివ నారాయణ డిమాండ్ చేశారు.స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం నందు విలేఖరుల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ 2014లో టీడీపీ ప్రభుత్వం హయాంలో గూడెం చెరువు వద్ద దాదాపు 1400 అప్పుడు కట్టిన ఎన్టీఆర్ గృహాలు ప్రజల వద్ద 500,25000,50000 మూడు రకాలుగా బ్యాంక్ లో డిపాజిట్ కట్టించి ఇళ్లు ఇస్తామని చెప్పారని తర్వాత 2019 ప్రభుత్వం మారిన తరవాత టిడ్కో పేరుతో ఇస్తామని ఐదు సంవత్సరాలుగా ప్రజలకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని,తరవాత మళ్ళీ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటిన ఇప్పటికీ ప్రజలకు టిడ్కో గృహాల పంపిణీ ప్రజలకు జరగలేదని,రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా కూడా ప్రజలకు టిడ్కో గృహాలు ఇస్తామని




చెప్పారన్నారు.ఇళ్లు లేని వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి టిడ్కో గృహాలను ప్రజలకు పంపిణీ చేపట్టాలని కోరుతున్నామని అన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రామకృష్ణ,రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# అకాల గాలివానలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### -ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి



కడప, (ప్రజా సీమ): అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలో నిన్న సాయంత్రం సుమారు ఏడు గంటల సమయంలో వచ్చిన అకాల గాలివానల కారణంగా మామిడి తోటలకు తీవ్రనష్టం సంభవించింది. కాయలతో నిండిన మామిడి చెట్లనుంచి కాయలు భారీగా నేలపై రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి రామాపురం మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ పరిధిలోని మామిడి తోటలను పరిశీలించారు. గాలివానల కారణంగా తోటల్లో ఉన్న మామిడి కాయలు దాదాపుగా పూర్తిగా రాలిపోయినట్లు ఆయన పేర్కొన్నారు.నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆదుకోవాలని రంగారెడ్డి కోరారు. సంబంధిత హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు ప్రతి రైతు తోటలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి, నివేదికలను పైఅధికారులకు పంపించాలని సూచించారు. జిల్లాస్థాయి అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వానికి నివేదించాలన్నారు.అదేవిధంగా నష్టపోయిన రైతులకు సబ్సిడీలు, పంట బీమా (ఇన్సూరెన్స్) త్వరితగతిన మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రబీ సీజన్‌లో కోసిన వరి పంటకుసైతం ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులకు అవసరమైన ఎరువులు, మందులు సబ్సిడీపై అందించాలని తెలిపారు.ఈ పరిశీలనలో నష్టపోయిన రైతులు రమేష్ రెడ్డి, భగవాన్ రెడ్డి, పెద్దిరెడ్డి,స్థానికరైతులు తదితరులు పాల్గొన్నారు.

# విషమిచ్చి భార్య హత్య -- భర్త అరెస్ట్



ప్రొద్దుటూరు,మే05(ప్రజా సీమ):ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్ రెడ్డి నగర్‌లో భద్రిపల్లె పద్మను విషమిచ్చి హత్య చేసిన కేసులో ఆమె భర్త భద్రిపల్లె కిరణ్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పీ విభూ కృష్ణ తెలిపారు. భార్య లావుగా ఉందని కారణంతో ముందుగానే ప్రణాళిక వేసుకుని కిరణ్ విషపదార్థం తెప్పించి 29న ఆమెకు ఇచ్చి, అనంతరం దిండు తో ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు వెల్లడించారు. ముద్దనూరుకు చెందిన మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# గ్రంథాలయం సమ్మర్ క్యాంప్ లో నేర్చుకోవడం పై పిల్లలు ఆసక్తి

### - కొనసాగుతున్న శిక్షణ. చంద్రశేఖర్

మదనపల్లె, (ప్రజా సీమ):కురుబలకోట శాఖ గ్రంథాలయం లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి ఆదేశాలు మేరకు ఉచిత సమ్మర్ క్యాంపు కొనసాగు తొందని స్థానిక శాఖ గ్రంథాలయ అధికారి బి.చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా 8వ రోజు మంగళవారం స్పోకెన్ ఇంగ్లీష్, కథలు చెప్పటం, మ్యాథ్స్ నేర్పడం, జరిగింద న్నారు. అలాగె డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, యోగ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగు తుందిని స్పష్టం చేశారు. ఈ క్యాంపు ముఖ్య ఉద్దేశం పిల్లల కి బాల్యం నుండి పుస్తక పఠనాశక్తిని, విజ్ఞాన వికాసాన్ని పెంపొందించడం తమ ఉద్దేశం అన్నారు. ఈ సమ్మర్ క్యాంపు జూన్ 6, వరకు జరుగు తుందని, ఉదయం 8 గంటల నుండి11 గంటల వరకు కొనసాగే ఉచిత శిక్షణ శిబిరాన్ని పరిసర ప్రాంత విద్యార్థిని విద్యార్థులు సద్విని యోగం చేసుకో వాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయురాలు ఎం. లావణ్య విద్యార్థులు పాల్గొన్నారు.




# మదనపల్లె లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సరికొత్త అడుగు

### - 10 కంట్రోల్ బూత్‌లను ప్రారంభించిన జిల్లా ఎస్పీ


### - అన్నమయ్య సర్కిల్ లో రిబ్బన్ కట్ చేసిన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి





మదనపల్లె మే 5, (ప్రజా సీమ): మదనపల్లి పట్టణం లో రోజురోజుకూ పెరుగు తున్న వాహనాల రద్దీని క్రమ బద్ధీకరించడానికి, ట్రాఫిక్ నిర్వహణను, సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లా పోలీస్ శాఖ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో అత్యాధునిక ట్రాఫిక్ కంట్రోల్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మంగళవారం మదనపల్లె అన్న మయ్య సర్కిల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ముఖ్య అతిథిగా హాజరై, 10 ట్రాఫిక్ బూత్‌లను ప్రారంభించారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ పట్టణం జిల్లాలోనే అతిపెద్ద వ్యాపార కేంద్రంగా ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ సవాలుగా మారిందని పేర్కొ న్నారు. విధుల్లో ఉన్న ట్రాఫిక్ సిబ్బంది ఎండ, వానల నుండి రక్షణ పొందుతూనే, ప్రజలకు మెరుగైన సేవలందించడానికి ఈ బూత్‌లు ఎంత గానో ఉపయోగ పడతాయన్నారు. 10 బూత్‌లను ప్రారంభించా మని, పట్టణంలోని అన్ని ప్రధాన జంక్షన్లలో వీటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నియమాలను పాటించి, మదనపల్లె ని రోడ్డు ప్రమాదాలు లేని పట్టణంగా తీర్చి దిద్దేందుకు పోలీసుల కు సహకరించాలని కోరారు. ఈ బూత్‌ల ఏర్పాటు వల్ల పోలీసుల ఉనికి కూడళ్లలో స్పష్టంగా కనిపిస్తుందని, ఇది నేర నియంత్రణకు కూడా దోహదపడు తుందనిపేర్కొన్నారు. జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం. వెంకటాద్రి పాల్గొని ట్రాఫిక్ బూత్‌ల పనితీరును పరిశీలించారు. మదనపల్లి డీఎస్పీ బి. పావని ట్రాఫిక్ సీఐ గురునాథ్, ఎస్‌బి సీఐ పి. రాజా రమేష్, మదనపల్లి వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ జి. రవి మరియు పలువురు పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పూడి శ్రీహరిని మర్యాద పూర్వకంగా కలిసిన బొడ్డేడ శివ,కె ఎం నాయుడు



అనకాపల్లి.మే05(ప్రజా సీమ): వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి వీరాభిమాని పార్టీ ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరి ని అనకాపల్లి నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయ కర్త శ్రీ మలశాల భరత్ సూచనల తో 80 వ వార్డ్ ఇంచార్జ్ కె ఎం నాయుడు,81వ వార్డ్ ఇంచార్జ్ బొడ్డెడ శివ మర్యాద పూర్వకంగా కలసి గజ మాల శాలువా తో ఘనంగా సత్కరించారు,ఈ సందర్బంగా శివ కె ఎం నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేదింపులు కు గురిచేసిన తర్వాత కోర్టుల ద్వారా బెయిల్ పొందారని జగన్ ని వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు ను ఇబ్బందులకు గురి చేస్తున్నారని,అలాగే పూడి శ్రీహరి ని పెట్టిన ఇబ్బందులకు తగిన విధం గా మూల్యం చెల్లించే రోజు వస్తుందని అధికారం శాశ్వతం కాదు అని 2029 లో వైస్ జగన్ ని సీఎం గా చేసుకోవడానికి బాగా కృషి చెయ్యాలని పూడి శ్రీహరి సూచించారు అని అన్నారు,యి కార్యక్రమంలో జిల్లా యూత్ వైజ్ ప్రెసిడెంట్ కర్రి రుద్రి,81 వ వార్డ్ యూత్ ప్రెసిడెంట్ బుద్ద జగన్, ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ మరిశెట్టి శ్రీను,కాండ్రేగుల తులసి దొడ్డి సాయి పాల్గొన్నారు.

# ఆశా డే సందర్భంగా కమలాపురంలో అవగాహన సమావేశం



కమలాపురం మే 6 (ప్రజా సీమ): ఆశా డే సందర్భంగా కమలాపురం మార్కెట్ యార్డ్ యూపిహెచ్సీ వద్ద మంగళవారం అవగాహన సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ జె. ప్రవీణ్ కుమార్ , కె. లఖుమయ్య , ఎం.వి.వి. ప్రసాద్ డాక్టర్ మునిశంకర్ , కొండారెడ్డి, హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు ఆశా వర్కర్లకు ముఖ్యమైన ఆరోగ్య అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా హెచ్ పి వి వ్యాక్సిన్ ప్రాముఖ్యత, ఎమ్ఆర్-1, ఎమ్ఆర్-2 టీకాల అవసరం, వేసవి కాలంలో తీవ్ర ప్రభావం చూపే హీట్ వేవ్స్ నుండి రక్షణ చర్యలు, అలాగే వైరల్ ఫీవర్స్ నివారణపై వివరంగా చర్చించారు. వక్తలు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం కాపాడటంలో ఆశా వర్కర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ఆరోగ్య సేవలనుసమర్థవంతంగా అందించడంలో వారు చేస్తున్నకృషిప్రశంసనీయమని అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి టీకాల ప్రాముఖ్యతను వివరించి, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు , ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటిపత్రిక PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక


# సినిమా న్యూస్



బాక్సాఫీస్ వద్ద రజనీకాంత్ మేజిక్ చేస్తే ఎలా ఉంటుందో మూడేళ్ళ క్రితం 'జైలర్' సినిమా నిరూపించింది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో వచ్చిన ఆ చిత్రం అప్పట్లో ఒక సంచలనం. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో జైలర్ సృష్టించిన వండర్స్ అంతా ఇంతా కాదు. ఆ సినిమా ఇచ్చిన జోష్‌తోనే ఇప్పుడు ఈ క్రేజీ కాంబినేషన్‌లో సీక్వెల్ రాబోతోంది. అయితే 'జైలర్ 2' అనౌన్స్‌మెంట్ వచ్చిన దగ్గరి నుంచి బిజినెస్ లెక్కల విషయంలో ట్రేడ్ వర్గాల్లో పెద్ద చర్చే నడుస్తోంది. సీక్వెల్ అనగానే రేట్లు పెరగడం సహజమే కానీ, ఈసారి మేకర్స్ కోట్ చేస్తున్న తెలుగు స్టేట్స్ ఫిగర్ చూసి బయ్యర్లు కొంత వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

తెలుగు రాష్ట్రాలకు సంబంధించి జైలర్ 2 రైట్స్ కోసం దాదాపు 60 కోట్ల రూపాయల వరకు మేకర్స్ డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. గతంలో జైలర్ మొదటి భాగం కేవలం 12 కోట్ల బిజినెస్ చేసి, తెలుగులో ఏకంగా 50 కోట్లకు పైగా షేర్ వసూలు చేసింది. ఆ లెక్కన చూస్తే 60 కోట్లు పెద్ద విషయం కాదనిపించవచ్చు. కానీ జైలర్ తర్వాత రజనీకాంత్ నుంచి వచ్చిన లాల్ సలామ్, వేట్టయన్, కూలీ వంటి సినిమాలు తెలుగులో బయ్యర్లకు నష్టాలను మిగిల్చాయి. అందుకే ఈసారి అంత భారీ మొత్తాన్ని పెట్టి రిస్క్ చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని ఇండస్ట్రీ టాక్.

మరోవైపు ఈ సినిమాలో నందమూరి బాలకృష్ణ ఒక కీలక పాత్రలో కనిపిస్తారనే ప్రచారం జోరుగా సాగింది. ఒకవేళ బాలయ్య కన్ఫర్మ్ అయితే తెలుగులో 60 కోట్లు వసూలు చేయడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ బాలయ్య ఈ ప్రాజెక్ట్‌కు నో చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో బిజినెస్ డీల్స్ మళ్ళీ మొదటికి వచ్చాయి.

## రజినీ సినిమా.. ఎందుకు కొనట్లేదు?

కేవలం రజనీకాంత్ ఇమేజ్ మీద మాత్రమే ఆధారపడి ఇంత భారీ రేటు చెల్లించడం కంటే, సినిమాపై బజ్ పెరిగే వరకు వేచి చూడాలని బయ్యర్లు డిసైడ్ అయ్యారట.

ఒకవేళ అనుకున్న రేటుకు రైట్స్ అమ్ముడుపోకపోతే, గతంలో లాగే సన్ పిక్చర్స్ సంస్థ దిల్ రాజు లేదా సురేష్ బాబు వంటి పెద్ద డిస్ట్రిబ్యూటర్ల ద్వారా కమిషన్ బేసిస్ మీద రిలీజ్ చేసే అవకాశం ఉంది. రజనీకాంత్ సినిమాకు తెలుగులో మంచి మార్కెట్ ఉన్నప్పటికీ, అది కంటెంట్ మీద మాత్రమే ఆధారపడి ఉంటుంది. జైలర్ మొదటి భాగం ట్రిపుల్ బ్లాక్ బస్టర్ హిట్ అవ్వడానికి కారణం అందులోని మ్యూజిక్, ఎలివేషన్స్. సీక్వెల్‌లో కూడా అదే స్థాయి ఇంటెన్సిటీ ఉంటే తప్ప 60 కోట్ల బ్రేక్ ఈవెన్ సాధించడం అంత సులభం కాదు. ఆగస్టులో రిలీజ్ ప్లాన్ చేస్తున్న ఈ సినిమాకు సంబంధించి ఇప్పటివరకు ఎటువంటి అఫీషియల్ అప్‌డేట్ లేకపోవడం కూడా బయ్యర్లలో కొంత అయోమయాన్ని కలిగిస్తోంది. రజనీ నెల్సన్ కాంబో మళ్ళీ మ్యాజిక్ రిపీట్ చేస్తుందని ఫ్యాన్స్ నమ్మకంగా ఉన్నా, వ్యాపార పరంగా మాత్రం లెక్కలు తేలడం లేదు. రైట్స్ కోసం కోట్ చేసిన ఆ డీల్ వర్కవుట్ అవుతుందా లేక మేకర్స్ కొంత తగ్గుతారా అనేది చూడాలి.




## సెన్స్ ఆఫ్ హ్యూమర్ అంటే అల్లు అర్జునే! లావణ్య మాటలు వైరల్



మెగా కుటుంబంలో కోడలిగా అడుగుపెట్టిన తర్వాత కూడా తనకంటూ ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తున్నారు హీరోయిన్ లావణ్య త్రిపాఠి. అందాల రాక్షసితో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి, తన సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న లావణ్య, కెరీర్ ప్రారంభం నుంచే కథా ప్రధాన సినిమాలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగారు. తర్వాత పలు సక్సెస్‌ఫుల్ సినిమాల్లో నటించిన ఆమె, మిస్టర్ సినిమా టైమ్ లో తన కో యాక్టర్ వరుణ్ తేజ్ తో ఏర్పడిన స్నేహం, తర్వాత ప్రేమగా ఆ తర్వాత వివాహ బంధంగా మారింది. పెళ్లి తర్వాత కూడా లావణ్య సినిమాల్లో కొనసాగుతూ వస్తున్నారు. ప్రస్తుతం లావణ్య ప్రధాన పాత్రలో తెరకెక్కిన సతీ లీలావతి సినిమా రిలీజ్ కు సిద్ధమవుతోంది. ఆనంది ఆర్ట్స్ సమర్పణలో డైరెక్టర్ తాతినేని సత్య తెరకెక్కించిన ఈ సినిమా మే 8న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే రిలీజైన ట్రైలర్ మంచి రెస్పాన్స్ ను రాబట్టగా, ఈ సినిమాతో లావణ్య మరోసారి తన నటనతో ఆకట్టుకునే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ట్రైలర్‌ను మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రిలీజ్ చేయడం కూడా సినిమాపై హైప్‌ను పెంచింది. ఇది మెగా కుటుంబం నుంచి లావణ్యకు లభిస్తున్న మద్దతుకు నిదర్శనంగా చెప్పొచ్చు.

ఇక వ్యక్తిగతంగా మెగా మరియు అల్లు కుటుంబ సభ్యులతో లావణ్యకు మంచి అనుబంధం ఉన్న విషయం తెలిసిందే. లావణ్య ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. సెన్సాఫ్ హ్యూమర్ విషయంలో ఎవరి నుంచి నేర్చుకోవాలనుకుంటారనే ప్రశ్నకు లావణ్య ఎలాంటి సందేహం లేకుండా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పేరును ప్రస్తావించారు. ఆయనకు ఉన్న టైమింగ్, సెన్సాఫ్ హ్యూమర్ తనకు చాలా ఇష్టమని, అలాంటి క్వాలిటీ ఎవరికైనా ఉండాలి అనిపిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చలకు దారి తీశాయి. మెగా కుటుంబంలోనే పలువురు స్టార్ హీరోలు ఉన్నప్పటికీ, లావణ్య అల్లు అర్జున్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించడం గమనార్హం. దీని వల్ల ఆమెకు అల్లు కాంపౌండ్‌తో కూడా సమానంగా అనుబంధం ఉందనే అభిప్రాయం బలపడుతోంది. సోషల్ మీడియాలో అభిమానులు కూడా ఈ విషయాన్ని హైలైట్ చేస్తూ, లావణ్యకు రెండు కుటుంబాల నుంచి కూడా మంచి సపోర్ట్ లభిస్తోందని కామెంట్లు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే, లావణ్య త్రిపాఠి వ్యక్తిగత జీవితం, కుటుంబ అనుబంధాలు, అలాగే కెరీర్ ఎంపికలు.. ఈ మూడు అంశాల్లోనూ సమతుల్యతను కాపాడుకుంటూ ముందుకు సాగుతున్నారు. సతీ లీలావతి రిలీజ్ తర్వాత ఆమె కెరీర్‌లో కొత్త మలుపు తిరుగుతుందా అనే ఆసక్తి ఇప్పుడు సినీ అభిమానుల్లో నెలకొంది.

## మెట్ గాలా ఈవెంట్లో మామిడి పండు మెరుపులు



వేసవిలో మామిడి పండు రుచులు చూడని వారు లేరు. అలాంటి మామిడి పండు ఇప్పుడు మెట్ గాలా -2026 ఫ్యాషన్ ఈవెంట్లో ప్రధాన ఆకర్షణగా మారింది. ఇది ఎంపిక చేసుకున్న డిజైన్‌లో ఇమిడిపోయి ఆ దుస్తులు ధరించిన వ్యక్తికి ప్రత్యేకతను ఆపాదించింది. ఇంతకీ మెట్ గాలా ఈవెంట్లో మ్యాంగ్ యాక్సెసరీని ధరించిన ఆ యువతి ఎవరు? అంటే.. ప్రపంచ కుభేరుడు ముఖేష్ అంబానీ కుమార్తె ఈషా అంబానీ. పూర్తి వివరాల్లోకి వెళితే.. సాధారణంగా వేసవి కాలం వచ్చిందంటే చాలు అందరికీ గుర్తుకు వచ్చేది మామిడి పండు రుచి. అయితే 2026 మెట్ గాలా ఫ్యాషన్ ఈవెంట్‌లో ఈ మామిడి పండు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతర్జాతీయ ఫ్యాషన్ వేదికపై ఒక కళాకృతిగా మారి అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రపంచ కుభేరుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీ కుమార్తె ఈషా అంబానీ ఈ మెట్ గాలా వేడుకలో తన వస్త్రధారణతో ప్రపంచ దృష్టిని ఆకర్షించడమే కాకుండా.. భారతీయ సంస్కృతిని.. వ్యక్తిగత సెంటిమెంట్లను మేళవించి ఒక కొత్త ఒరవడిని సృష్టించారు. ఈషా ధరించిన దుస్తుల్లో దాగి ఉన్న మామిడి పండు యాక్సెసరీ ఇప్పుడు ఇంటర్నెట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈషా అంబానీ తన చేతిలో పట్టుకున్న ఆ మామిడి పండు నిజమైన పండు కాదు. అది ప్రముఖ కళాకారుడు సుబోధ్ గుప్త రూపొందించిన 20 ఏళ్ల నాటి ఒక అరుదైన శిల్పం (స్కల్ప్చర్). కేవలం ఫ్యాషన్‌ను ప్రదర్శించడమే కాకుండా.. భారతీయ కళాకారుల ప్రతిభను అంతర్జాతీయ వేదికపై గౌరవించడం ఈషా లక్ష్యంగా కనిపిస్తోంది. ప్రఖ్యాత డిజైనర్ గౌరవ్ గుప్తా రూపొందించిన అద్భుతమైన చేనేత చీర శిల్పకళా శైలిలో ఉన్న కేప్ తనకు ఒక రాచరికపు రూపాన్ని అందించాయి. ఈ వస్త్రధారణ ఆధునికతకు.. భారతీయ చేనేత కళకు నిలువుటద్దంగా నిలిచింది. ఈషా ధరించిన బ్లౌజ్ కేవలం అలంకరణకు మాత్రమే పరిమితం కాలేదు.. దాని నిండా ఎన్నో భావోద్వేగపూరితమైన అంశాలు ఉన్నాయి. తన తల్లి నీతా అంబానీకి సంబంధించిన మధుర జ్ఞాపకాలను ఈ బ్లౌజ్ డిజైన్‌లో పొందుపరిచినట్లు ఈషా వెల్లడించారు. తల్లిపై ఉన్న ప్రేమాభిమానాలను ప్రతిబింబించేలా ఈ బ్లౌజ్ రూపొందించడం విశేషం. గ్లోబల్ రెడ్ కార్పెట్‌పై నడుస్తున్నప్పుడు కూడా మన మూలాలను.. అమ్మ జ్ఞాపకాలను వెంట తీసుకెళ్లడం ఈషా వ్యక్తిత్వానికి అద్దం పడుతోంది. వస్త్రధారణలో వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సెంటిమెంట్లను జోడించడం ఈషా అంబానీ లుక్‌కు మరో ప్రత్యేకతను తెచ్చింది. తన పిల్లలు పుట్టినప్పుడు బహుమతులుగా అందిన కొన్ని అరుదైన వస్తువుల భాగాలను కూడా ఈ బ్లౌజ్ డిజైన్‌లో చేర్చారు. ఒక తల్లిగా తన అనుభూతులను.. కుటుంబ బంధాలను ఇలా ఫ్యాషన్ రూపంలో ప్రపంచానికి చూపించడం అందరినీ ఆకట్టుకుంది. దీనివల్ల తను ధరించిన డ్రెస్ కేవలం ఒక దుస్తుల జతగా కాకుండా.. ఒక జ్ఞాపకాల అరలా మారిపోయింది. మెట్ గాలా 2026 వేదికపై ఈషా అంబానీ ప్రదర్శించిన ఫ్యాషన్ ఒక సంపూర్ణ కళాఖండం అని చెప్పవచ్చు.

## తల్లైనా ఆ హీరోయిన్ ఇప్పటికీ అమ్మ కూచీనే!



సినీ పరిశ్రమలో కథానాయికల ప్రయాణం వెనుక వారి తల్లుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుంది. కెరీర్ ప్రారంభంలో కూతురిని వెన్నంటి ఉంటూ షూటింగ్ స్పాట్‌లలో వారికి రక్షణగా తోడుగా నిలిచే తల్లులను తరచుగా చూస్తుంటాం. అయితే హీరోయిన్ ఒక స్థాయికి చేరుకున్నాక లేదా వివాహం చేసుకున్న తర్వాత సాధారణంగా మదర్ సపోర్ట్' అనేది ఇంటికే పరిమితమవుతుంది. కానీ బాలీవుడ్ నటి యామీ గౌతమ్ విషయంలో మాత్రం ఇది పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. తాను తల్లిగా మారినా? ఇప్పటికీ తన తల్లికి అమ్మకూచీనే అని గర్వంగా చెబుతోం ది. యామీ గౌతమ్ వృత్తిపరమైన బాధ్యతలను – వ్యక్తిగత జీవితాన్ని ఎంతో సమర్థవంతంగా బ్యాలెన్స్ చేయగలు గుతున్నారంటే? దానికి ప్రధాన కారణం ఆమె తల్లి అని అంటున్నారు. సాధారణంగా నటీమణులు పెళ్లి చేసుకున్న తర్వాత వారి తల్లుల ప్రమేయం తగ్గుతుంది. కానీ యామీ గౌతమ్ విషయంలో ఆమె తల్లి ఇల్లు, పిల్లల బాధ్యతలతో పాటు అన్ని విషయాల్లో చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. ఈ బలమైన పునాది ఉండటం వల్లే తాను కెరీర్‌లో ఎలాంటి ఒత్తిడి లేకుండా సంతోషంగా కొనసాగుతున్నానంది. చాలామంది హీరోయిన్ల తల్లులు తమ కూతుళ్లు పెద్ద స్టార్స్ అయ్యే వరకూ మాత్రమే మేనేజర్లుగా , గార్డియన్లుగా వ్యవహరిస్తారు. కానీ యామీ గౌతమ్ తల్లి మాత్రం మానసిక స్థైర్యంగా మారారు. షూటింగ్ షెడ్యూల్స్ వల్ల బిజీగా ఉన్న సమయంలో ఇంటి బాధ్యతలను తల్లి భుజాన వేసుకోవడం వల్లే తాను నటనపై పూర్తి దృష్టి పెట్టగలుగుతున్నానని యామీ కృతజ్ఞతా భావం వ్యక్తం చేసింది. ఇది కేవలం సహాయం మాత్రమే కాదని ఒక తల్లి తన బిడ్డపై చూపే అంతులేని ప్రేమకు నిదర్శనమని అంటోంది. ఒక మహిళ తన కెరీర్‌లో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలంటే కుటుంబ మద్దతు ఎంత అవసరమో యామీ మాటలు ప్రతిబింబిస్తున్నాయి.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma